ఆదివారం ప్రత్యేకం

కొత్త బంగారు లోకం!



కొత్తబంగారు లోకం.. మీకు అవుతుంది సొంతం.. బంగారం కొనుగోలు చేయలేకపోతున్నామనే బాధెందుకు.. ప్రత్యామ్నాయం వచ్చేసిందండోయ్.. 24 క్యారెట్.. 22 క్యారెట్ బంగారు వస్తువులనే కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు.. అచ్చంగా బంగారంలా కనిపించే వెండిపై గోల్డ్ కోటెడ్ ఆభరణాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి.. అదీ కొనలేరా.. ఇమిటేషన్ జ్యూయలరీ ఉండనే ఉందిగా.. మన బడ్జెట్ మేరకు అందమైన వస్తువులను తీసుకోవచ్చు.. అలంకరించుకోవచ్చు.. మనసును కుదుటపరచవచ్చు.. అదీ కాదంటారా.. ఒక ఏడాది ఆగారంటే.. ఏకంగా తులం రూ.20 వేలకే అచ్చంగా స్వచ్ఛమైన బంగారం కొనేయ వచ్చు.. అదెలాగంటారా.. సామాన్యులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం 9 క్యారెట్ గోల్డ్ అందుబాటులోకి తీసుకురానుంది.. ధర తులం రూ.20 వేల ఉండొచ్చని అంచనా.. ఇంకెం దుకు ఆలస్యం ఏ బంగారం కొంటారో ఆలోచించుకోండి మరి!

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/
(రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

మెరిసేదంతా బంగారం కాదండోయ్..



- బంగారం ధర దూకుడు
- రోజురోజుకు పెరుగుదల
- పడిపోయిన అమ్మకాలు
- ఉమ్మడి తూర్పున 1,200 దుకాణాలు
- 50కిపైగా కార్పొరేట్ బ్రాంచ్‌లు
- నాడు రోజుకు రూ.40 కోట్ల విక్రయాలు
- ఇప్పుడు రూ.22 కోట్లే
- త్వరలో కేంద్రం 9 క్యారెట్ ఆభరణాలు
- తులం రూ.20వేలకే బంగారం
- సామాన్యుల్లో కొంగొత్త ఆశలు
- బంగారం కోటెడ్ సిల్వర్ ఆభరణాలకు క్రేజ్
- ఇమిటేషన్ జ్యూయలరీకి డిమాండ్

ఎంత కొన్నా ఇంకా ఇంకా కొనాలనిపించేది బంగారం.. మోజు తగ్గదు.. ఆకర్షణ ఆగదు.. ఆ మెరుపునకు చిక్కితే ఇక అంతే. ఎంతున్నా ఇంకా ఇంకా కావాలని పిస్తూనే ఉంటుంది..మహిళలకైతే పసిడి అంటే మహాపిచ్చి. ధనవంతులకైతే ఇదో స్టేటస్ సింబల్.. పేదోళ్లకు అత్యవస రానికి ఆదుకునే వస్తువు..ఒక రకంగా చెప్పాలంటే పసిడి సురక్షిత పెట్టుబడి సాధనం.. ఇంట్లో ఆడపిల్ల ఉన్న తల్లిదం డ్రులైతే పిల్ల పెళ్లికి బంగారం కోసం ఎన్నో ఆశలు పెట్టుకుం టారు..ముందునుంచే కొంచె కొంచెం కొని కూడబెడతారు. ఇప్పుడా పసిడి పట్టపగ్గాల్లే కుండా పరుగెడుతోంది. రెండు నెల ల కిందట తగ్గినట్లే తగ్గి ఇప్పుడు ఆల్‌టైం హై రేటుకు ఎగబా కింది.దీంతో జిల్లాలో పసిడి అమ్మకాలు గణనీయంగా తగ్గిపో యాయి.ఈ తరుణంలో కేంద్రం కొత్తగా తేవాలనుకుంటోన్న 9 క్యారెట్ గోల్డ్‌పై సామాన్యులు ఆశలు పెంచుకున్నారు. మరి కొందరు పసిడి ప్రియులైతే పెరిగిన ధరలు భరించ లేక గోల్డ్ కోటెడ్ ఉన్న సిల్వర్ ఆభరణాలు కొంటున్నారు.అసలు బంగారు ఆభరణాలకంటే రెట్టింపు డిజైన్లు దొరుకుతున్నాయి. దీంతో వీటిని కొంటుండడంతో ఈ వ్యాపారం జోరందుకుంది.

1964లో 24 క్యారెట్స్ తులం బంగారం రూ.63.25

1964	రూ.63.25
1970	రూ.184
1980	రూ.1,330
1990	రూ.3,200
2000	రూ.4,400
2010	రూ.18,500
2020	రూ.48,651
2024	రూ.75,640

'తరుగ'ని దోపిడీ.. మజూరీతో బేజారు

బంగారం వస్తువులు, ఆభరణాల కొనుగోలులో కాస్త మాయ ఉంటుంది. తరుగు, మజూరీలో కొందరు వర్తకులు ఎంతో కొంత బురిడీ కొట్టిస్తుంటారు.నగిషీలు ఎక్కువగా కావాలంటే తరుగు కూడా ఆ పరిమాణంలోనే ఉంటుంది. ఇవాళ 5 నుంచి 25శాతం వరకూ కూడా తరుగు వేస్తున్నారు. జిగేల్‌మనే పగడాలతో, కళ్లు మిరుమిట్లు గొలిపే రాళ్లతో, ఆకట్టుకునే రంగులతో ఉన్న వస్తువుల్లో బంగారం ఎంత ఉందో చెప్పడం కష్టం. ఇదే అదనుగా వీటిలో భారీ దోపిడీ జరుగుతోంది. ఎక్కువగా బరువు ఉండే రాళ్లు, ముత్యా లు వంటి వాటిని వాడి కొందరు వ్యాపారులు దోచేస్తున్నారు.

సామాన్యుడికి బంగారం లాంటి కబురు..

9 క్యారెట్ వస్తోంది..



ఒకపక్క బంగారం ధరలు భారీగా పెరిగి పోతూ సామాన్యుడు కొనుగోలు చేసే పరిస్థితి లేక పోయింది. మరోపక్క బంగారం విలువ అధికంగా ఉండడంతో వీటిని ధరించే మహిళలపై రోజు రోజుకు నేరాలు పెరిగి పోతున్నాయి.ఒంటిపై ఉన్న ఆభరణాలు తస్కరించడం, కొన్నిసార్లు చంపేసి లాక్కుపోతున్న పరిస్థితులు పెరిగి పోతుండడంతో కొత్తగా 9 క్యారెట్ బంగారు ఆభరణా లను దించాలని కేంద్రం ఆలోచి స్తోంది. ఇది వచ్చే ఏడాదిలోగా కార్యరూపం దాల్చే అవకాశం ఉంది.వాస్తవానికి ఇప్పుడు ప్రతిఒక్కరూ 22 క్యారెట్ విభాగం లో 916 హాల్ మార్క్ ఆభరణాలే వినియోగిస్తున్నారు. ఇందు లో 91.67 శాతం బంగారం ప్యూరిటీ ఉంటుంది. 8.33 శాతం కాపర్, సిల్వర్ కలుపుతారు. 22 క్యారెట్ల బంగారం గ్రాము ప్రస్తుతం రూ.7,100కు ఎగబాకి కొనలేని పరిస్థితులు తలెత్తా యి.దీంతో కొత్తగా 9 క్యారెట్‌తో బంగారు ఆభరణాలను కేంద్రం దించబోతోంది.ఇందులో బంగారం కేవలం 37.5 శాతమే ఉంటుంది. 42.5 శాతం సిల్వర్, 20 శాతం కాపర్ ఉంటుంది. ఇతర లోహాలు ఎక్కువ మోతాదులో కలపడం వల్ల 9 క్యారె ట్ బంగారం ధర తులం రూ.20 వేలకే వచ్చేయనుంది. అంటే 22 క్యారెట్ అయితే తులం రూ.71 వేలు ఉంది. తద్వా రా 9 క్యారెట్ బంగారానికి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. 9 క్యారెట్‌లో పసిడి తక్కువగా కలుస్తుంది కాబట్టి అంతగా ఆకర్షణీయంగా కనిపించక పోవచ్చనే వాదన ఉంది. మరోపక్క చాలా మంది బంగారాన్ని పెట్టుబడి సాధనంగా చూస్తారు కాబట్టి దీనిపై ఎంతవరకు మొగ్గుచూపుతారనేది చూడాలి.

తగ్గి పెరిగిన ధర..

కేంద్రప్రభుత్వం జూలైలో పసిడిపై కస్టమ్స్ ట్యాక్స్ తగ్గించడంతో ధరలు ఒక్కసారిగా తగ్గాయి. గ్రాము రూ.6,900 నుంచి క్రమేపీ రూ.6,300 వరకు పడిపోయింది.దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్కసారిగా కొనుగోళ్లు పెరిగాయి. ఒక్క వారంలో కొనుగోళ్లు రూ.550కోట్ల వరకు జరిగాయి. బంగారం కొనుగోళ్లకు సంబంధించి వార్షిక ఫిక్సిడ్ డిపాజిట్లు ఏకంగా రూ.800కోట్ల వరకు వెళ్లాయి. అయితే గత నెలరోజులుగా బంగారం పరుగు పెడుతూనే ఉంది. రెండు రోజుల కిందట శుక్రవారం 22 క్యారెట్ల బంగారం ఏకంగా రూ.7,100 వరకు ఎగబాకింది. అటు ఆల్‌టైం గరిష్టానికి ధరలు పెరగడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొను గోళ్లు సగానికి సగం పడిపోయాయి.

సగానికి పడిపోయిన అమ్మకాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1,200 వరకు బంగారు ఆభరణాల విక్రయ దుకాణాలున్నాయి. ఇందులో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, మండపేట, పెద్దాపురం పట్టణాల్లో అధికంగా ఉన్నాయి. వీటన్నింటిలో రోజుకు ధరలు తగ్గిన సమయంలో రూ.40 కోట్ల వరకు అమ్మకాలు జరిగేవి. సగటున ఒక్కో దుకాణం రోజుకు 225 గ్రాముల వరకు విక్రయించేవి. ఇప్పుడు రోజువారీ విక్రయాలు రూ.22 కోట్లకు పడిపోయాయి. ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్ బంగారం దుకాణాలు అన్ని బ్రాంచ్‌లు కలిపి 50 వరకు ఉన్నాయి. వీటిలో సీజన్ సమయంలో రోజుకు రూ.55 కోట్ల వరకు విక్రయాలు జరిగేవి. ఇప్పుడు ధరాభారంతో రూ.33 కోట్ల వరకు జరుగుతున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పసిడి వర్తక సంఘం విశ్లేషించింది.







అచ్చంగా బంగారమే..

ఒకపక్క పసిడి కొనలేనంతగా పెరగడంతో ఉమ్మడి జిల్లాలో మహిళలు వన్ గ్రాం గోల్డ్‌తో తయారు చేసిన ఇమిటేషన్ ఆభరణాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. రోజువారీగా ధరించడానికి నల్లపూసలు, గాజులు తదితర వన్ గ్రాం ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వస్తువులకు మహా డిమాండ్ ఉంది. ప్రస్తతం ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక వన్‌గ్రాం గోల్డ్ షోరూమ్‌లు వెలుస్తున్నా యంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. చివరకు పెళ్లిళ్లు, పుట్టినరోజుల వేడుకల్లోను బహుమతుల కింద ఈ ఆభరణాలే ఇస్తున్నారు.

సిల్వర్‌తో ధగధగలు..



గోల్డ్ కోటింగ్‌తో కూడిన సిల్వర్ ఆభరణాలు ఈ మధ్య మార్కెట్లో భారీగా దొరుకుతున్నాయి. గోల్డ్ కోటింగ్‌లా అసలే మాత్రం కనిపించకుండా అచ్చంగా బంగారు ఆభరణాల్లాగే ఉంటున్నాయి. గాజులు, నెక్లెస్, వడ్డాణం, చెవి రింగులు ఒక టేంటి అసలు బంగారు ఆభరణాల కంటే వీటిలోనే వందల కొద్దీ మోడళ్లు లభ్యమవుతున్నాయి. ధరిస్తే అసలు బంగారం లాగే ఇవి నిగనిగలాడుతాయి. పైగా వీటిని కొనుగోలు చేస్తే ఏడాది లేదా ఒక నెలలోనే తిరిగి అదే దుకాణానికి ఇచ్చేస్తే కొనుగోలు ధరలో 55 శాతం బైబ్యాక్ ఆభరణాల రూపంలో ఇస్తున్నారు. అనేక దుకాణాల్లో ఇదే విధానం అమలవుతోంది. దీంతో నచ్చిన ఆభరణాలను మహిళలు కొనుగోలు చేసి తిరిగి కొద్దినెలలకే అవి వెనక్కు ఇచ్చి కొత్తవి తీసుకుంటున్నారు. తద్వారా పసిడి ధరల పెరుగుదల భారం నుంచి బయట పడుతున్నారు. కాకినాడలో త్వరలో గోల్డ్‌కోటెడ్ సిల్వర్ ఆభరణాలు విక్రయించడానికి ఓ కార్పొరేట్ కంపెనీ షోరూం కూడా ప్రారంభించబోతోంది. 22 క్యారెట్ ఆభరణాల దగ్గర నుంచి వన్‌గ్రాం గోల్డ్, గోల్డ్‌కోటెడ్ సిల్వర్ ఆభరణాలు సైతం భారీగా ఆన్‌లైన్‌లో లభ్యమవుతున్నాయి. అనేక మంది మహిళలు ఆన్‌లైన్ ఆర్డర్ ద్వారా రప్పిస్తున్నారు. ఈ మార్కెట్ జిల్లాలో రూ.25కోట్ల వరకు ఉంటుందని అంచనా.

బంగారం ఎలా వస్తుందో తెలుసా..?

- ఆభరణాల తయారీకి బంగారం ఎక్కడినుంచి వస్తోందా తెలుసా? ప్రముఖ కార్పొరేట్ కంపెనీలైనా, చిన్న దుకాణాలైనా కచ్చితంగా బంగారం బిస్కెట్ కొని వీటి నుంచి ఆభరణాలు తయారు చేస్తాయి. నేరుగా విదేశాల నుంచి ఈ బిస్కెట్లు తేవడానికి లేదు. బ్యాంకుల ద్వారా మాత్రమే బిస్కెట్లు, కడ్డీలు కొనుగోలు చేయాలి. జిల్లాలో అనేక కంపెనీలు బ్యాంకుల నుంచి అరకిలో, కిలో 24 క్యారెట్ బిస్కె ట్లు కొంటాయి.కేంద్రప్రభుత్వ పరిధిలోని ఎంఎంటీసీ అనే సంస్థ నేరుగా విదేశాల నుంచి బంగారం బిస్కెట్లు, నాణేలు కొని బయట విక్రయిస్తుంది. ఎంఎంటీసీ నుంచి ఎవరైనా వీటిని కొనుగోలు చేసుకోవచ్చు.
- బంగారం మెత్తగా ఉండి బాగా సాగే గుణం కలిగి ఉంటుంది.వెంట్రుక కంటే సన్నగా సాగదీసినా గట్టిదనం తగ్గదు.ఒక ఔన్సు బంగారాన్ని 300 చదరపు అడుగుల రేకుగా సాగదీయవచ్చు. ఒక గ్రాము బంగారాన్ని ఒక చదరపు మీటరు వైశాల్యం కలిగిన రేకుగా లేదా 20 మైక్రో మీటర్ల మందం ఉన్న 165 మీటర్ల పొడవాటి తీగలా చేయవచ్చు.
- బంగారాన్ని నాణేలు, వస్తువులు, ఆభరణాలు తయారు చేయడం దగ్గర నుంచీ వాడకం విపరీతంగా పెరిగింది. 1930 నుంచి నాణేల చలామణీని ఆపేశారు.
- 2012 నాటికి ప్రపంచంలో 2లక్షల టన్నుల బంగారం ఉత్పత్తి జరిగింది.
- బంగారం స్వచ్ఛతను ఫైన్నెస్ లేదా క్యారెట్లలో కొలుస్తారు.బరువును ట్రాయ్ ఔన్సుల్లో లెక్కిస్తారు.ఒక ట్రాయ్ ఔన్సు అంటే మన పరిభాషలో కిలోన్నర బంగారం.
- బంగారపు దారాలను దుస్తుల ఎంబ్రాయిడరీకి వినియోగిస్తారు.టీవీలు,కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల్లో స్వల్పంగా బంగారాన్ని ఉపయోగించవచ్చని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేసింది.
- బంగారంలో 24 క్యారెట్స్ ప్యూరిటీ కాగా ఆభరణాల తయారీలో 22 క్యారెట్స్ వినియోగిస్తారు. ఏ అభరణమైనా 22 క్యారెట్ ప్యూరిటీ గోల్డ్‌తో మాత్రమే తయారు చేస్తారు. 18 క్యారెట్ బంగారం కూడా ఉంది. డైమండ్స్ తయారీలో ఈ బంగారాన్ని ఉపయోగిస్తారు. త్వరలో 9 క్యారెట్ బంగారం అందుబాటులోకి రానుంది.అదే వస్తే ధరలు తగ్గుతాయి.

ఇసుక సరఫరాకు 2.0 వెర్షన్ సాఫ్ట్‌వేర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28: ఇసుక సరఫరాకు 2.0 వెర్షన్ సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఇసుక నిర్వహణ వ్యవస్థ (ఏపీఎస్ఎంఎస్), టెక్నికల్ స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ) ప్రక్రియపై ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన శిక్షణలో దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 9 ఇసుక రీచ్‌ల ద్వారా ఇసుకను ప్రజలు, వినియోగదారులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఇసుక సరఫరా చేసే ప్రతి వాహనానికి తప్పనిసరిగా జియోట్యాగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో 9 రీచ్‌లకు విధుల్లో భాగంగా రెండు షిఫ్టుల విధానంలో 18 మందిని నియమించామన్నారు. ప్రతి ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కలెక్టర్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో ఒక డిప్యూటీ తహశీల్దార్‌ను నియమించి పర్యవేక్షణ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఇన్‌చార్జి ఆర్డీవోలు కేఎల్ శివజ్యోతి, ఆర్.కృష్ణనాయక్, జిల్లా మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కండి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 28 : ధాన్యం సేకరణ వచ్చే నెలలో ప్రారంభించనున్న దృష్ట్యా.. క్షేత్రస్థాయిలో అక్టోబరు 2వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు సంబంధించి సమన్వయ శాఖల అధికారులు, మిల్లర్ల ప్రతినిధులతో సమీక్షించారు.ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాల మేరకు కొనుగోళ్లు చేపట్టడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో మిల్లుల సామర్థ్యం తనిఖీలు నిర్వహించి సోమవారం నాటికి నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో మిల్లర్ల ప్రతినిధులు కర్రి వెంకటరెడ్డి, మద్దూరి రామయ్య, గారా బాబూరావు, ఎస్ జనార్దనరావు, మూర్తి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమాలకు అడ్డుకట్ట వేయండి

ఎక్సయిజ్ సూపరింటెండెంట్ లావణ్య ఆదేశం



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సారా అరికట్టడంతో పాటు మద్యంలో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిందేనని ఎక్సయిజ్ సూపరింటెం డెంట్ సీహెచ్ లావణ్య ఆదేశిం చారు.ఎక్సైజ్ సౌత్ స్టేషన్‌ని శనివారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలపై ఆరా తీశారు. నూతన ఎక్సయిజ్ పాలసీ, ప్రక్రియ తదితర అంశాలపై సిబ్బందికి అవగా హన కల్పించారు.స్టేషను భౌగోళిక పరిధి, నేరాల తీరు వంటి వాటిపై ఈఎస్‌కి ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ వివరించారు.



ఆకాశంలో అద్భుతః ఆకాశంలో శనివారం సాయంత్రం అద్భుతం ఆవిష్కృతమైంది.. కడియంలో మేఘం కమ్మిన వేళ ఇలా ఇంద్రధనస్సు ప్రత్యక్షమై సుందర దృశ్యంతో కనువిందు చేసింది.. - కడియం

సమాజ హితమే సాహిత్యం

నన్నయ ఉపకులపతి శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 27: సమాజ హితమే సాహిత్యం అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం, స్ఫూర్తి కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో 'గురు విశ్వస్ఫూర్తి రచనలు-ఆధునిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక సామాజిక దృక్పథం' అంశంపై శనివారం నిర్వహించిన తెలుగు జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు.ప్రస్తుత కాలంలో శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. కన్వీనర్, నన్నయ వర్సిటీ తెలుగు శాఖ సహాయాచార్యుడు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల నుంచి 350 మంది సదస్సుకు హాజరయ్యారన్నారు. 79 పరిశోధనా పత్రాలతో 'సదస్సు వ్యాసావళి' అనే పరిశోధనా గ్రంథాన్ని రూపొందించామన్నారుఈ కార్యక్రమంలో మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకర్,కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఎన్‌యూ పూర్వ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి,యోగి వేమన విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.ఈశ్వరరెడ్డి, స్ఫూర్తి కుటుంబం ఆథర్ ఎం.రజనీకాంతరావు, మేనేజింగ్ ట్రస్టీ వి.సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

తంటికొండ వీఏవో అదృశ్యం

తల్లి ఫిర్యాదు.. కేసు నమోదు

గోకవరం, సెప్టెంబరు 28 : గోకవరం మండలం తంటికొండ వ్యవసాయ సహాయకురాలిగా పనిచేస్తున్న గాలి దీప్తిస్వర్ణలత కనిపించడంలేదని ఆమె తల్లి మాండ్రు ప్రమీల శనివారం పోలీసులను ఆశ్రయించింది. గోకవరం గ్రామానికి చెందిన స్వర్ణలత గత కొన్నేళ్లుగా తంటికొండ వ్యవసాయ సహాయకురాలుగా పనిచేస్తోంది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పంట పొలాల నష్ట పరిహారం విషయంలో అధికారులు సక్రమంగా వ్యవహరించలేదంటూ అదే గ్రామానికి చెందిన పలువురు రైతు ప్రతినిధులు శనివారం ఆమెను నిలదీశారు. దీంతో స్వర్ణలత తీవ్ర మనస్తాపానికి గురై తల్లికి ఫోన్‌లో జరిగిన విషయాన్ని తెలియజేసింది.ఆ వెంటనే తల్లి ప్రమీల తంటికొండ గ్రామ సచివాలయానికి చేరుకొని కుమార్తె జాడ కోసం ప్రయత్నించగా అక్కడ ఆమె ఆచూకీ కానరాలేదు. జరిగిన సంఘటనపై స్వర్ణలత తల్లి ప్రమీల పోలీసు లను ఆశ్రయించి తన కుమార్తె ఆచూకీని వెంటనే కనుగొనాలని కోరారు.అంతే కాకుండా తన కుమార్తె పట్ల అమర్యాదగా ప్రవర్తించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.



చిరుత..ఎక్కడో! 7




గుప్పెడంత గుండెకు... ఉప్పెనంత ఒత్తిడి?

» యువతలోనూ పెరుగుతున్న గుండెపోటు కేసులు » నేడు వరల్డ్ హార్ట్ డే

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28:
ఇది వరకు కాలంలో గుండెపోటు కేసులు పెద్దవారిలో మాత్రమే కనిపించేవి. నేటి ఆధునిక కాలంలో యువతలో కూడా గుండెపోటు కేసులు పెరుగుతున్నాయి. గుప్పెడంత గుండెకు ఉప్పెనంత ఒత్తిడి కలిగిస్తున్నాయి. బీపీ, షుగర్, ధూమపానం వంటి అలవాట్లు లేకపోయినా కూడా గుండె జబ్బులు వస్తాయా? అంటే అవుననే చెప్తున్నారు కార్డియాలజిస్టులు. మానసిక ఒత్తిడి, ఆందోళన గుండె జబ్బులకు దారి తీస్తాయని హెచ్చరిస్తున్నారు.

ఆధునిక జీవితంలో యువతలో మానసిక ఒత్తిడి, సామాజిక ఒత్తిడి పెరిగింది. శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పటికీ మానసిక ఆందోళన వల్ల జన్యుపరమైన మార్పులు జరిగి రక్తప్రసరణలో తేడాలతో రక్తం చిక్కబడడం, రక్తనాళాల్లో మార్పులు చోటుచేసుకుని హార్ట్ ఎటాక్‌కు దారి తీస్తోంది.

ధూమపానం, మత్తు పదార్థాలు, ఊబకాయం, మానసిక ఒత్తిడి, అధిక కొలెస్ట్రాల్, పోస్ట్ కొవిడ్ వంటివి ప్రధాన కారణాలుగా కనిపిస్తాయి. అంతే కాకుండా వాయు, శబ్ధ కాలుష్యం, నిద్రలేమి, మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, ఆధునిక ఆహారపు అలవాట్లు గుండె జబ్బులకు దారితీస్తాయి.

ముందుగా గుర్తించడం ఎలా? ఏం చేయాలి?

గుండె జబ్బులను ముందుగా గుర్తించాలంటే... రెగ్యులర్ హెల్త్ చెకప్ అవసరం. బీపీ 120/80, ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ 100లోపు, టోటల్ కొలెస్ట్రాల్ 200లోపు, ఎఫ్‌బీఎస్ 110లోపు, బీఎంఐ 23.5-25.0గా ఉండాలి. గుండె సంబంధిత లక్షణాలు ఉంటే వెంటనే స్పెషలిస్టు డాక్టర్‌ను సంప్రదించాలి. ఆందోళన తగ్గించుకోవాలి. యోగా, మెడిటేషన్, వ్యాయామం, సంగీతం వినడం, మానసికోల్లాసం కోసం కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉత్సాహంగా గడపడం అలవర్చుకోవాలి.

ముందుగా గుర్తిస్తే ముప్పు తప్పుతుంది



డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్
పల్స్ హాస్పటల్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్

పెద్దవారైనా, యువత అయినా గుండె జబ్బులను ముందుగా గుర్తిస్తే ప్రాణపాయం నుంచి బయటపడొచ్చు. రెగ్యులర్ హెల్త్ చెకప్ తప్పనిసరిగా చేయించుకోవాలి. ఏమాత్రం లక్షణాలు కనిపించినా అశ్రద్ధ చేయకుండా స్పెషలిస్ట్ డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

శ్రీనివాసా గోవిందా... శ్రీవేంకటేశా గోవిందా

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.28.30 లక్షలు



ఆత్రేయపురం, సెప్టెంబరు 28: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్య లక్ష్మీ హోమం, బాల భోగం శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.28.30 లక్షలు లభించినట్టు ఆలయ ఉప కమిషనరు, ఈవో చక్రధరరావు తెలిపారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఇందుకూరి సుబ్బలక్ష్మి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కోరుకొండ లక్ష్మీనరసింహస్వామికి రూ.2.70 లక్షలు విలువైన

బంగారు కిరీటం బహూకరణ


ఈవో రామచంద్రమోహన్‌కి కిరీటం అందజేస్తున్న దాత

అన్నవరం, సెప్టెంబరు 28: అన్నవరం దత్తత ఆలయం కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామికి శనివారం కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన బి.ఆదినారాయణమూర్తి బంగారు కిరీటం బహూకరించారు. దీనిని దాత ఈవో రామచంద్రమోహన్‌కు అందజేయగా దాతను ఆయన అభినందించారు. దీని విలువ సుమారు రూ.2.70 లక్షలు అని దేవస్థానం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కొండలరావు, డీఈ రాంబాబు, కోరుకొండ ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


దివాన్‌చెరువులో...

ఎక్కడుందో!


కడియంలో...

» తొలుత దివాన్‌చెరువు పుష్కర వనంలో
» అక్కడి నుంచి కడియం వనాల్లోకి
» బెదిరిపోవడమే కారణమా!
» 25 రోజులుగా సంచారం
» అటవీ శాఖ అధికారులకు చిక్కని వైనం
» వదంతులతో భయం భయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వనంలోంచి జనారణ్యంలోకి వెళ్లిన చిరుత అయోమయంగా తిరుగుతున్నట్టు తెలుస్తోంది. వన్యమృగాలు అడవులను వీడి రావడానికి ఇష్టపడవు. కానీ చిరుత పులి ఆహార వేటలో ఇటుగా వచ్చేసింది. చిరుతలు సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకూ 'జంట' కట్టే సమయం. అలా వెతుకులాటలో కూడా అడవి నుంచి తప్పిపోయి ఉండొచ్చు. దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులో తొలిగా ఈ నెల 6వ తేదీన దాని అడుగులను గుర్తించారు. వెంటనే రంగంలోకి దిగిన అటవీ అధికారులు గాలింపు మొదలుపెట్టారు. ఒకవైపు ప్రజలను అప్రమత్తం చేస్తూనే.. పులిని బంధించడానికి అవసరమైన ఏర్పాటు చేశారు. కానీ ట్రాప్ కెమెరాలకు తప్ప బోనుకు చిక్కకుండా చిరుత తిరుగుతోంది. 19వ తేదీ రాత్రి చివరిగా దివాన్‌చెరువు అభయారణ్యంలో చిరుత జాడ కనిపించింది. తర్వాత మూడు రోజులు ఏ అలికిడీ లేదు. 24వ తేదీ రాత్రి 8గంటల సమయంలో కడియపులంకలోని లక్ష్మణస్వామి నర్సరీలో చిరుత అడుగులు కనిపించాయి. అక్కడ ఇళ్ల సమీపం వరకు వెళ్లి వెనుదిరిగింది. బహుశా మేకలు, కోళ్లు వంటివి లేకపోవడంతో వెనక్కు మళ్లిందని అంచనా వేస్తున్నారు. ఆ ప్రాంతంలో 40 ట్రాప్ కెమెరాలు, 4 బోనులు ఏర్పాటు చేశారు. బోన్లు, వాటి బయట ఎనిమిదిచోట్ల మేక పిల్లలను ఉంచారు. కానీ ఈనాటికీ ఫలితం లేకపోయింది. ప్రధానంగా వర్షం అటంకంగా మారింది.

వన్యప్రాణులు ఒకవేళ అడవి నుంచి బయటకు వచ్చేసినా మళ్లీ వాటంతటవే వెనక్కు మళ్లి వచ్చిన దారిన వెళ్లిపోతాయి. గతంలో ప్రత్తిపాడులో పెద్దపులి రెండు నెలలు సంచరించి అడవిలోకి వచ్చిన దారిలోనే వెళ్లిపోయింది. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుందని అనుకున్నారు. చిరుత లేదా పులి వచ్చే మార్గంలో మల, మూత్ర విసర్జన చేస్తుంది. వేటాడిన కళేబరాలు ఉంటాయి. వాటి వాసన ఆధారంగా అదే దారిలో అడవిలోకి వెళ్లిపోతుంది. కానీ వర్షాలు రావడంతో ఆ అవకావం కూడా లేకుండా పోయింది. శనివారం వాతావరణం కాస్త తెరిపిచ్చింది. ఎండ రావడంతో చిరుత ఆనవాళ్లు దొరికే అవకాశం కనిపిస్తోంది.

వదంతులతో భయం...

మనుషులకు చిరుత అంటే ఎంత భయమో.. చిరుతకు కూడా మనుషులంటే అంతే భయం. ప్రస్తుతం చిరుత తన గూడుకు చేరుకునే ప్రయత్నంలో ఉంది. ఈ సమయంలో అయోమయానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. చిరుత ఊళ్లోకి రాకుండా శబ్దాలు చేస్తున్నారు. అయితే దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు నుంచి ఆ శబ్ధాల వల్లే వల్ల అయోమయానికి గురై కడియపులంక దిశగా ప్రయాణించినట్టు తెలుస్తోంది. ఆ రోజు సాయంత్రం అభయారణ్యంలోని ఫారెస్టు అకాడమీ ప్రాంతం నుంచి జాతీయ రహదారి దాటి పుష్కర వనం వైపు వచ్చింది. వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా పెద్ద పెద్ద డీజే శబ్దాలు, బాణసంచా కాల్చడం వల్ల ఎటుపోవాలో తెలియని పరిస్థితుల్లో రిజర్వు ఫారెస్టు దాటిందని అంచనా వేస్తున్నారు. ఈలోపు సోషల్ మీడియాలో విపరీతంగా వదంతులు ట్రోల్ అవుతున్నాయి. దీంతో మరింత భయం పట్టుకుంది. చిరుత కోసం ఏర్పాటు చేసిన బోన్ల వద్దకు మనుషులు వెళ్తున్నారు. సెల్ఫీలు కూడా తీసుకుంటున్నారు. దీంతో చిరుత అక్కడ ఉంచిన ఎరకోసి వచ్చే అవకాశాలు తగ్గుతున్నాయి. చిరుత పులులు 200 మీటర్ల దూరంలోని వాసనను కూడా పసిగట్టగలవు. దీంతో బోన్ల వద్ద జనాల పాదముద్రలు, వాసన పసిగట్టి చిరుత ఆ వైపుగా రావట్లేదని అంచనా వేస్తున్నారు.

చిరుత జాడ మళ్లీ కనిపించలేదు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాదరావు



తూర్పు గోదావరి జిల్లా కడియపులంకలో 24వ తేదీ రాత్రి చిరుత అడుగులను చివరిగా గుర్తించామని.. తర్వాత దాని అలికిడి లేదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాదరావు వెల్లడించారు. చిరుత పులి సంచారంపై వదంతులు వస్తున్న నేపథ్యంలో ఆదివారం ఆయన జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షం కారణంగా చిరుత అడుగు జాడలు కూడా నేలపై ఉండట్లేదని చెప్పారు. ట్రాప్, సీసీ కెమెరాల్లో కూడా చిరుత చిత్రాలు చిక్కలేదన్నారు. చొప్పెల్ల, కేశవరం, మండపేటల్లో కనిపించిదని వార్తలు రాగా వెంటనే తమ బృందాలు చేరుకున్నాయన్నారు. స్థానికులను ఆరా తీసి ఆ సమాచారాలను వదంతులుగా గుర్తించామన్నారు. మొత్తం పది బృందాలు రేయింబవళ్లు గస్తీ తిరుగుతున్నాయని చెప్పారు. చిరుతను బంధించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశామని, అన్ని చర్యలూ చేపడుతున్నామని ప్రసాదరావు వెల్లడించారు.

• జర జాగ్రత్త...



చిరుతను చూసి ఎట్టి పరిస్థితుల్లోనూ పరుగెత్తడం, కూర్చోవడం, తుప్పల్లో నక్కడం వంటివి చేయకూడదు. చేతులు పైకెత్తి కదలకుండా నిలబడాలి. చిరుతను గమనిస్తూ చాలా నెమ్మదిగా అడుగులు వెనక్కి వేస్తూ ఉండాలి. మరీ దగ్గరగా వస్తే చేతులు పైకెత్తి బిగ్గరగా అరవాలి. దాంతో పెద్ద జంతువుగా భావించి చిరుత వెనక్కి మళ్లే అవకాశం ఉంది. ఆరు బయట బహిర్భూమికి వెళ్లరాదు. గుంపులుగా తిరగడం శ్రేయస్కరం. సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకే చిరుత సంచరిస్తోందని ట్రాప్ కెమెరాలకు చిక్కిన ఫొటోల ద్వారా తెలుస్తోంది. అందువల్ల ఆ సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉండడం తప్పనిసరి.

• హాని చేస్తే జైలుకే...

చిరుత వన్యప్రాణి కాబట్టి చట్టాలు అత్యంత కఠినంగా ఉంటాయి. చిరుత కనిపిస్తే హాని చేయకుండా బంధించడం పార్వాలేదు. అయితే వెంటనే పోలీసులకు లేదా ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలి. అంతేగానీ కర్రలు, రాళ్లు వంటి వాటితో కొట్టడం, గాయపర్చడం, హతమార్చడం వంటివి చేస్తే మాత్రం వన్యప్రాణుల సంరక్షణ చట్టాల ప్రకారం ఏడేళ్ల వరకూ శిక్ష పడుతుంది. పైగా నాన్ బెయిలబుల్ కేసులు పెడతారు. అందువల్ల చిరుతను అయోమయానికి గురి చేయకుండా నడుచుకుంటే మంచిదని అటవీ శాఖ అధికారులు చెప్తున్నారు. చిరుత కనిపించిన వెంటనే ట్రాంక్విలైజ్.. అంటే మత్తు ఇంజక్షన్ ఇవ్వడం కుదరదు. దాని బరువు, వయసు అంచనా వేసి డోస్ ఇస్తారు. అది కూడా పులిని బంధించడానికి వలలు వగైరా ప్రయత్నాలు అయిన తర్వాత మాత్రమే చివరి ప్రయత్నంగా ట్రాంక్విలైజ్ చేయాల్సి ఉంటుంది. అందువల్ల చిరుతను పట్టుకునే విషయంలో ఫారెస్టు అధికారులు కూడా చాలా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది.

కేటుగాళ్లు

» ఇళ్లను కొల్లగొట్టేవారు ముగ్గురు...
మోటారు సైకిళ్లను మాయం చేసేవారు ఇద్దరు
» కాకినాడలో ఐదుగురు నిందితుల అరెస్టు
» రూ. 34 లక్షలు విలువైన చోరీ సొత్తు స్వాధీనం
» వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్


స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్ (పైన) పోలీసులు పట్టుకున్న మోటారు సైకిళ్లు



కాకినాడ క్రైం, సెప్టెంబరు 28: గుట్టు చప్పుడు కాకుండా తాళాలు వేసి ఉన్న ఇళ్లను కొల్లగొట్టి అందినకాడికి లాగేస్తారు ముగ్గురు. తాళాలు వేసి ఉన్న మోటారు సైకిళ్లను మూడో కంటికి తెలియకుండా తస్కరిస్తారు మరో ఇద్దరు. ఈ తరహా దొంగతనాలకు పాల్పడుతున్న మొత్తం ఐదుగురిని కాకినాడ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ వివరాలను వెల్లడించారు. ఇటీవల రాత్రిపూట నేరాలు, మోటారు సైకిళ్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఆదేశానుసారం అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు నేతృత్వంలో కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో రాత్రిపూట గస్తీని ముమ్మరం చేశారు. శుక్రవారం రాత్రి బృందాలుగా విడిపోయి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు రామకృష్ణారావు పేటలోని ఇసుకలేటి మోజెస్ అనే యువకుడి ఇంటి వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఏలూరు జిల్లా వంకాయగూడెం గాంధీ కాలనీ... ప్రస్తుతం (కాకినాడ రామకృష్ణారావుపేట)కు చెందిన పాత నేరస్తుడు 30 ఏళ్ళ ఇసుకలేటి మోజెస్. రాజమహేంద్రవరం గణేష్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు 41 ఏళ్ళ ఇసుకలేటి గాంధీ. రాజమహేంద్రవరం రాజేంద్రనగర్‌కు చెందిన 32 ఏళ్ళ తిపర్తి పురుషోత్తమ రామ్‌కుమార్. వారు చేసిన నేరాలను అంగీకరించారు. కాగా నిందితులు తిపర్తి పురుషోత్తమ రామ్‌కుమార్ ద్వారా వారు దొంగిలించిన చోరీ సొత్తును విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. నిందితుల నుంచి రూ.24.99 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు కొత్త కాకినాడ శివారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరని అదుపులోకి తీసుకుని విచారించారు. కాకినాడ రాగంపేటకు చెందిన పాత నేరస్తుడు 19 ఏళ్ళ కడగాల ఏసు. కొయ్యవారి వీధికి చెందిన 24 ఏళ్ళ గొర్రెల దుర్గాప్రసాద్ చేసిన నేరాలను అంగీకరించారు. నిందితులు కాకినాడ, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో తాళాలు వేసి ఉన్న మోటారు సైకిళ్లను మారు తాళాలతో తీసి తస్కరించి గొర్రెల దుర్గాప్రసాద్ ద్వారా విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సా చేసేవారు. నిందితులు ఐదుగురినీ చాకచక్యంగా పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ కృష్ణ, కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చెతన్యకృష్ణ, టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు, ఎస్ఐ వినయ్‌ప్రతాప్, క్రైం ఏఎస్ఐ కొప్పిశెట్టి గోవిందరావు, ధనరాజ్, పుల్లయ్య, హెచ్‌సీలు గొప్పు చిన్న, వర్మ, సత్యమూర్తి, కానిస్టేబుళ్లు మౌళి, నాయుడు, ప్రసాద్, స్వామిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వర రావు పాల్గొన్నారు.

పిఠాపురంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం


పిఠాపురంలో ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 28: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉండగా పిఠాపురానికి మినీ స్టేడియం మంజూరు చేయించి పనులు ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. త్వరలోనే దీనిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్కూల్ గేమ్స్ అండర్-19 ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ, రగ్బీ జిల్లా పోటీలు నిర్వహించి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లను ఎంపిక చేశారు. 200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా ఆర్చరీలో 24 మందిని, రగ్బీలో 24 మందిని ఎంపిక చేసినట్టు ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను, రావుల రమేష్, కేతవరపు కృష్ణ, జనసేన నాయకులు సూరవరపు సురేష్, చెల్లుబోయిన సతీష్, మార్నీడి రంగబాబు, అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ శివరామకృష్ణ, రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వియ్యపు రామన్నరాజు, అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, సీఈవో నాగలింగేశ్వరరావు, కోచ్ లక్ష్మణరావు పాల్గొనగా, న్యాయనిర్ణేతలుగా నవీన్, వంశీ, శివప్రసాద్, అఖిల్ వ్యవహరించారు.

మావోయిస్టు వారోత్సవాలు ఎవరి కోసం?

వ్యతిరేకంగా వెలసిన వాల్ పోస్టర్లు



ఎటపాక, సెప్టెంబరు 28: ఎవరి కోసం ఈ మావోయిస్టు వారోత్సవాలు? గిరిజనులకు ఉపయోగపడని వారోత్సవాలు మాకొద్దు అంటూ మావోలకు వ్యతిరేకంగా అల్లూరి ఆదివాసీ యువజన సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శనివారం వాల్‌పోస్టర్లు వెలిశాయి. మండలంలోని విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై బండిరేవు, లక్ష్మీపురం, బాసవాగుతో పాటు భద్రాచలం-కూనవరం రోడ్‌లో నందిగామ, మురుమూరు గ్రామాల్లోని కల్వర్టులు, చెట్లకు పోస్టర్లను అతికించారు. అమాయక గిరిజనులను ఇన్ఫార్మర్ల నెపంతో చంపుతున్నారని, బస్సులను దహనం చేస్తూ గిరిజనులకు రవాణా సౌకర్యం లేకుండా చేస్తున్నారన్నారు. వారోత్సవాల ఉచ్చులో తమను లాగొద్దని, సభలు, సమావేశాలంటూ వేధించవద్దన్నారు. స్థూపాలు, కట్టడాలని మీ పాపాల్లో మమ్మల్ని పాలుపంచొద్దని పేర్కొన్నారు. మీదారికి రావాలని బెదిరించవద్దని, గిరిజనుల సహనం పరీక్షించవద్దన్నారు. కాగా మావోయిస్టు వారోత్సవాలు జరుగుతున్న తరుణంలో ఈ పోస్టర్లు వెలవడం చర్చనీయాంశంగా మారింది.

అన్నీ తానై...

తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె

అలమూరు, సెప్టెంబరు 28: కుమారుడు లేని తండ్రికి అన్నీ తానేనని కుమార్తె ముందుకొచ్చి అంతిమ సంస్కారాలు జరిపింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరుకు చెందిన గన్ని అమ్మిరాజు (64) గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తె సీతా మహాలక్ష్మికి వివాహం కావడంతో అమెరికాలో స్థిర పడింది. తండ్రి మరణ వార్త తెలుసుకుని అక్కడి నుంచి బయల్దేరి శనివారం ఉదయ ఆలమూరు చేరుకుంది. తండ్రి అంత్యక్రియలు తానే చేయాలని నిర్ణయించుకుంది. ఆలమూరు గోదావరి ఏటిగట్టు వద్ద ఉన్న హిందూ శ్మశానవాటికలో కర్మకాండలు జరిపి తలకొరివి పెట్టింది.



శృంగారవల్లభ స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, సెప్టెంబరు 28: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతిలోని శృంగారవల్లభ స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు స్వామివారికి పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,32,730 అన్నదాన విరాళాల ద్వారా రూ.62,915, కేశఖండన ద్వారా రూ.7.880, తులాభారం ద్వారా రూ.600, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.25,035... మొత్తం రూ.2,29,160 ఆదాయం వచ్చిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

ఏజెన్సీ సమాచారం




వై.రామవరం ఆసుపత్రిలో జ్వరపీడితులు, కాళ్లు పట్టేయడంతో స్టిక్‌తో నడక

అంతు చిక్కని రోగం

అందరికీ ఒకే రకమైన లక్షణాలు... తీవ్ర జ్వరం, కాళ్లు పట్టేయడం, దద్దుర్లు

వై.రామవరంలో విజృంభిస్తున్న విష జ్వరాలు

వై.రామవరం, సెప్టెంబరు 28: మండలంలో పిల్లలు, వృద్ధులు, నడి వయస్కులు కొన్ని రోజులుగా మంచానపడుతున్నారు. తీవ్రమైన జ్వరం, కాళ్ల పట్టేయడం, శరీరంపై దద్దుర్లు రావడం వంటి లక్షణాలతో సతమతమవుతున్నారు. దీంతో సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజూ వ్యాధిగ్రస్తులు చేరుతున్నారు. వై.రామవరంలో ప్రతి ఇంటిలోని వారినీ రోగాలు చుట్టుముడుతున్నాయి. పక్క గ్రామాల నుంచి జ్వరపీడితులు వచ్చి ఆసుపత్రిలో చేరుతున్నారు. రక్త పరీక్షల్లో టైఫాయిడ్ జ్వరాలు అధికంగా నమోదవుతున్నాయి. అన్ని రకాల పరీక్షలు లేకపోవడంతో వ్యాధి నిర్ధారణ కాక రోగులు ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లకు పరుగులు పెడుతున్నారు. చిన్న పిల్లలూ రోగాల బారిన పడడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. టైఫాయిడ్, చికున్ గున్యా లక్షణాలతో రోగులు వస్తున్నారని వై.రామవరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ తెలిపారు. వాతావరణ మార్పులు, కలుషితనీరు, శానిటేషన్ లోపాలతో ఇటువంటి వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. రోగులు అప్రమత్తంగా ఉండి జాప్యం వహించకుండా ఆసుపత్రికి వచ్చి వైద్యం పొందాలని సూచించారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి: మేజిస్ట్రేట్ బాబు

రంపచోడవరం, సెప్టెంబరు 28: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని రంపచోడవరం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ పి.బాబు సూచించారు. శనివారం ఆయన గిరిజన గురుకుల కళాశాల (బాలికలు)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, బోధన తీరు, మౌలిక సదుపాయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీరు, మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్లు తక్షణం ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. తనవంతు సాయంగా హాస్టల్ వసతి గదులు, హాస్టల్ ప్రాంగణంలో లైట్లు ఏర్పాటు చేయిస్తానని మేజిస్ట్రేట్ బాబు చెప్పారు.

ఐసీడీఎస్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా అరుణలత



రంపచోడవరం, సెప్టెంబరు 28: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల అసోసియేషన్ రంపచోడవరం డివిజన్ ప్రెసిడెంట్‌గా పుల్లి అరుణలతను ఎన్నుకున్నారు. శనివారం ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీకాంత్‌రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రకాష్‌కుమారి అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా అరుణలతతో పాటు 13 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాష్‌కుమారి మాట్లాడుతూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల సమస్యలకు ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని అధికారులను కోరారు.ఇప్పటికే జిల్లాల సూపర్‌వైజరు సంఘాలను ఏర్పాటు చేశామని, త్వరలో 26 జిల్లాలు పూర్తిచేసి రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామని చెప్పారు.

వై.రామవరం ఎస్‌ఐగా రామకృష్ణ



వై.రామవరం, సెప్టెంబరు 28: వై.రామవరం ఎస్‌ఐగా బి.రామకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గంగవరం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఎస్‌ఐగా వున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్ వరరామచంద్రపురం బదిలీ అయ్యారు. నూతన ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ గిరిజనులకు నిష్పక్షపాతంగా సేవలందిస్తానని చెప్పారు.

చిడుమూరులో 'మన ఇల్లు-మన గౌరవం'

చింతూరు, సెప్టెంబరు 28: వివిధ దశల్లో ఉన్న ఇళ్లను లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ అరవింద్ కుమార్ కోరారు. శనివారం చిడుమూరులో నిర్వహించిన 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా ఆయన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ అంశాలపై అవగాహన కల్పించారు. వంద రోజుల పని దినాలు, ఎస్‌హెచ్‌జీ రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దారు చిరంజీవి, ఎంపీడీవో రవికుమార్, ఏపీవో శ్యామ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా మానవహారం, శాంతి ర్యాలీ



మోతుగూడెం, సెప్టెంబరు 28: మావోయిస్టులు సెప్టెంబరు 21 నుంచి అక్టోబరు 20 వరకు 20వ ఆవిర్భావ వార్షిక మాసోత్సవాలకు పిలుపునిచ్చారు. వీటికి వ్యతిరేకంగా బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగంపాడు సంతలో అల్లూరి ఆదివాసీ యువజన సంఘం, గిరిజన అభ్యుదయ సంఘంలోని గిరిజన యువకులు శనివారం శాంతి ర్యాలీ జరిపి మానవహారం నిర్మించారు.

ఎరక్కపోయి... ఇరుక్కుపోయి...



ఎటపాక: ఓ కుక్క ఆహారం కోసం వెదుకుతూ ప్లాస్టిక్ డబ్బాలో మూతిపెట్టింది. మూతి కాస్తా డబ్బాలో ఇరుక్కుపోయింది. 3, 4 రోజులైనా బయటపడలేక నానా పాట్లు పడుతోంది. ఈ కుక్క శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. **- ఎటపాక**

రైతులకు సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కూనవరం, సెప్టెంబరు 28: అటవీ శాఖాపరంగా వ్యవసాయ భూముల్లో చిక్కులు ఎదుర్కొన్న చూచిరేవులగూడెం రైతులకు పూర్తి అనుమతి ఇప్పించడంలో సహకరించిన రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, చూచిరేవుల గ్రామ గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక అటవీ శాఖాధికారి మోహినీ విజయలక్ష్మి గిరిజన రైతులను అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఈ నేపథ్యంలో తాను ఎమ్మెల్యేని కలిసి రెవెన్యూ అధికారులతో అనుమతి పత్రాలు ఇప్పించానన్నారు. ఇక నుంచి గిరిజనుల వ్యవసాయానికి ఎటువంటి చిక్కులు ఉండవన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి: ఎంపీపీ లలిత

మారేడుమిల్లి, సెప్టెంబరు 28: గర్భిణులు మంచి ఆహారపు అలవాట్లు కలిగి పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ సార్ల లలితకుమారి కోరారు. మారేడుమిల్లి పీహెచ్‌సీలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పోషణ మేళాలో ఆమె పాల్గొన్నారు. లోతట్టు గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు మెడికల్ ఆఫీసర్ శిరీష వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లపై ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ప్రసన్న విశ్వనాథ్ అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. సర్పంచ్ కొండా జాకబ్, ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, పరిపాలనాధికారి పి.జయంతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత

రాజవొమ్మంగి, సెప్టెంబరు 28: జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నయపాలెం గ్రామంలో యువకులతో జడ్డంగి ఎస్‌ఐ చిన్నబాబు శనివారం సమావేశమయ్యారు. వారికి వాలీబాల్ కిట్ అందజేశారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎస్‌ఐ చెప్పారు.

పీఎంజేఏవై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాజానగరం, సెప్టెంబరు 29: ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకాన్ని పారిశుధ్య కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గట్టి రామ భాస్కర్, డాక్టర్ వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. వరల్డ్ రేబిస్ డేను పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో శనివారం ప్రొపలేక్టిక్ మొదటి డోసు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ. పీఎంజేఏవై పథకంలో పారిశుధ్య కార్మికుల కుటుంబంలో అనారోగ్యానికి గురైన వ్యక్తి రూ.5లక్షలు వరకు వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చన్నారు. సీహెచ్‌సీ కృపాబాయమ్మ, ఎంపీహెచ్ఎస్ ఎన్వీరమణ, రత్నకుమారి, సునీత, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్తకులకు ప్రభుత్వ పరంగా సహకరిస్తాం

• విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28: వర్తకులకు ప్రభుత్వపరంగా సహకరిస్తామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్‌రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన పాలకవర్గంతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్తకుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చాంబర్ ఎన్నికలకు వెళ్లకుండా ఏకగ్రీవం చేసేందుకు తన వంతు కృషిచేశానన్నారు. వర్తక పెద్దలు సహకరించారన్నారు. ప్రభుత్వం తరఫున అందించాల్సిన సహకారం తాము అందిస్తామన్నారు. జనసేన నగర ఇంచార్జీ అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నగర అధ్యక్షుడు బొమ్ముల దత్తులు మాట్లాడుతూ జాంపేట బ్యాంక్‌లను ఏకగ్రీవం చేసి ఇంతటి ఘనత సాధించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును అభినందించారు. నూతన అధ్యక్షుడు తవ్వా రాజా మాట్లాడుతూ తమ ప్యానల్ ఏక గ్రీవం కావడానికి సహకరించిన పెద్దలందరికి ధన్యవాదాలు తెలిపారు. మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు మాట్లాడుతూ వర్తకులు అనేవారు విడిపోయివుండకూడదన్నారు. నూతన పాలక మండలి సభ్యులు ఒంటెద్దు సూరిబాబు, ఇయ్యపు మురళీధర్ ,ఆకుల శ్రీనివాస్, తోట లక్ష్మీనారాయణ(కన్నా), అల్లంకి నాగేశ్వరరావు, భేరూలాల్ జైన్, దొండపాటి జయసింహా, యెక్కల వీరనాగేశ్వరరావు, మండవల్లి సత్యనారాయణ, కొండ్రెడ్డి సత్యనారాయణమూర్తి, మునగ రమేష్, సలాది సుబ్రహ్మణ్యం, తాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాబాయిని చంపినప్పుడు ఏమైంది నీ మానవత్వం

తిరుపతికి వెళ్లడానికి ఏవేవో కారణాలు చెబుతూ నీ మతం మానవత్వం అని పెద్దగొప్పగా మాట్లాడిన జగన్ అతని బాబాయిని చంపినప్పుడు ఆ మానవత్వం ఏమైందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రశ్నించారు. డిక్లరేషన్‌పై సంతకం పెట్టలేక జగన్ తిరుమల వెళ్లలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అల్లర్లకు జగన్ వేసిన ప్లాన్ పారకపోవడంతో ఆగిపోయాడన్నారు.

ప్రపంచమేధావి రాజమహేంద్రవరంలో పర్యటించడం అద్భుతం

ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయుడు రాజమహేంద్రవరంలో పర్యటించడంతన దృష్టిలో ఒక అద్భుతమైన సంఘటన అని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరం గోకవరంబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహంవద్ద అంబేడ్కర్ పర్యటించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగాను, నవయువ కవి చక్రవర్తి గుర్రం జాషువా 129 జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రతియేట నిర్వహిస్తున్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు కోరుకొండ రంజీవి, తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్‌ల ను అభినందించారు. కార్యక్రమంలో కాశి నవీన్‌కుమార్, దారా యేసురత్నం, తాళ్ళురివిజయ్ కుమార్, జువ్వల రాంబాబు,మోతా నాగలక్ష్మి, కప్పల వెలుగుకుమారి, కోసూరి చండీప్రియ, మొకమాటి సత్యనారాయణ, ఇజ్జిన మధు, బొర్రచిన్ని, తురకల నిర్మల, పులిదిండిఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.అనంతరం క్వారీసెంటర్‌లో అజ్జరపు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహానికి, కవి గుర్రం జాషువ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి కమిషనర్ కేతన్‌గార్గ్ నివాళుల ర్పించారు. అనంతరం సుబ్బారావుపేటలోని ఆనందనిలయంలోని ఆనాథ బాలల హాస్టల్‌కు నగరపాలక సంస్థ ఉద్యోగులు కమిషనర్ 10 సీలింగ్ ఫ్యాన్లు, 10 ట్యూబ్‌లైట్లను అందించారు. తాడేపల్లి గణేశ్వరరావును కమిషనర్ సత్కరించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపుతున్న కారంగి హేమశ్రీ, తరంగిణీలకు కార్పొరేషన్ ఉద్యోగులు సహకారంతో రూ.5వేలు నగదు పురస్కారాలు అందించారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రాజమహేంద్రవరం అర్బన్: ప్రజల ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. జీజీహెచ్‌కు వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తాము కృషి చేస్తున్నామని వెల్లడించారు. శనివారం రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను ఆయన సందర్శించారు. అక్కడికి వచ్చిన రోగులు, ప్రజలను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్ని స్కానింగ్ మెషీన్లను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకు ?

• మండల పరిషత్ సమావేశంలో ఏకరువు పెట్టిన ప్రజాప్రతినిధులు

రాజానగరం, సెప్టెంబరు 29: ప్రజా సమస్యలు పరిష్కారంకాని సమావేశాలెందుకంటూ పలువురు ప్రజాప్రతినిధులు అధికారుల ఎదుట ఏకరువు పెట్టారు. రాజానగరం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన శనివారం జరిగింది. మండలంలోని సంబంధిత శాఖాధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పరిష్కారం కావడం లేదన్నారు. ప్రధానంగా గ్రామాల్లో ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై జడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో కల్వర్టులు, తూరలు ఏర్పాటుచేస్తే అధిక వర్షాల సమయంలో రహదారులు ఛిద్రం కాకుండా కాపాడుకోవచ్చని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. అనంతరం పలు సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈసమావేశంలో మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వర్లు, మండల కో-ఆప్షన్ సభ్యులు రత్నం, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం.సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహసీల్దార్ శాంతి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గట్టి రామ భాస్కర్, ఏవో షేక్ ఇమామి ఖాసిమ్, గృహనిర్మాణశాఖ ఇన్‌చార్జ్ ఏఈ గిరి, ఆర్అండ్‌బీ ఏఈ కిరణ్, రాజానగరం, సంపత్‌నగరం ట్రాన్స్‌కో ఏఈలు వీఎస్ సుధాకర్, ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు టీవీ సుబ్బారావు, అవినాష్, మత్స్యశాఖ ఏఈ హరీష్, ఎంఈవోలు రామన్నదొర, జ్యోతిప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మహాచండీ హోమం



గాదరాడలో మహాచండీ హోమం చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల దంపతులు

కోరుకొండ, సెప్టెంబరు 28: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత దీక్షకు సంఘీ భావంగా కోరుకొండ మండలం గాదరాడలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆయన సతీమణి వెంకటలక్ష్మి దంపతులు శనివారం మహాచండీ యాగం నిర్వహించారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి పవిత్ర లడ్డు తయారీలో కల్తీ చేసిన నెయ్యి వినియోగం భక్తకోటి మనోభావాలు దెబ్బతీశాయని దీంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా తాము ఈ హోమం నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే చేపట్టిన ప్రాయశ్చిత సంఘీభావ హోమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'లడ్డూ పవిత్రతను కాపాడండి'

కడియం, సెప్టెంబరు 28: తిరుమల శ్రీవారి లడ్డూ అపవిత్రం అయిందని, పవిత్రతను కాపాడాలంటూ కూటమి నాయకులు ఆధ్వర్యంలో శనివారం పూజా కార్యక్రమాలు చేపట్టారు. కడియం శ్రీభ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు చేశారు. అక్కడ నుంచి పాదయాత్రగా గోవింద నామస్మరణలుచేస్తూ శ్రీదేవిభూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడు నాగులపల్లి వీరబాబు, టీడీపీ నాయకుడు వెలుగుబంటి నాని, జనసేన నాయకుడు ముద్రగడ జమీ, కూటమి నాయకులు బొర్సు సుబ్రహ్మణ్యం, ఆకుల శ్రీధర్, గుత్తుల హరిప్రసాద్, కొటికలపూడి వేంకటేశ్వరరావు, చిక్కాల శ్రీను, గుర్రాల రామ్మోహన్, గ్రీన్‌లాండ్ బాబి, గారపాటి తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఆరికరేవులలో సామూహిక సీమంతాలు

బిక్కవోలు, సెప్టెంబరు 28: ఆరికరేవుల గ్రామంలోని గర్భిణులకు శనివారం సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు చేశారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సీమంతాలకు టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు నిధులు సమకూర్చారు. కార్యక్రమంలో కూటమినేతలు మహిపాల వినాయకుడు, స్వామి నాయుడు, ఇందల వీరబాబు, నాగడమూడి వీరభద్రరావు, సీడీపీవో జెస్సీ ఫ్లోరెన్స్, సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రం జాషువా, భగత్‌సింగ్‌ల జయంతి

కడియం, సెప్టెంబరు 28: కడియం ఉన్నత పాఠశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం గుర్రం జాషువా 129వ జయంతి, షహీద్ భగత్‌సింగ్ 117వ జయంతి కార్యక్రమం జరిగింది. జాషువా, భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రఫీయుద్దీన్, ఎంఈవో వైనాగేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ , శరత్‌బాబు, గిరిజ, రామకృష్ణంరాజు, శ్రీనివాస్, శ్రీవెంకటదుర్గా పాఠశాల తెలుగుక్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మన ఇల్లు - మన గౌరవం లబ్ధిదారుల అవగాహన సదస్సు

రంగంపేట, సెప్టెంబరు 28: పీఎంఏవై 1.0 పథకంలో మంజూరైన రూఫ్‌లెవెల్, రూఫ్‌కాస్ట్ దశలో ఉన్న ఒక లక్ష గృహాలను అక్టోబరు- 2024 నాటికి, మిగిలిన గృహాలను మార్చి 2025 నాటికి పూర్తి చేయాలని కార్యాచరణ రూపొందించినట్లు రంగంపేట హౌసింగ్ డీఈ సీహెచ్ వేణుగోపాల్ అన్నారు. చంద్రేడులో సర్పంచ్ జాస్తి వెంకటపద్మావతి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు ఏర్పాటుచేసిన మన ఇల్లు - మన గౌరవం లబ్ధిదారుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.

'మార్చి నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తికావాలి'

కడియం, సెప్టెంబరు 28: గృహనిర్మాణశాఖ ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలు మార్చి నాటికి పూర్తి చేయాలని లేకుంటే మంజూరైన ఇళ్లు రద్దు అవుతాయని రాజమహేంద్రవరం హౌసింగ్ ఈఈ జి. రాజగోపాల్ తెలిపారు. జేగురుపాడు లేఅవుట్‌లో మన ఇల్లు మన గౌరవం పేరిట హౌసింగ్ లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజగోపాల్ మాట్లాడుతూ లేఅవుట్‌లో 2020 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, గృహనిర్మాణశాఖద్వారా 1406 మందికి ఇళ్లు మంజూరయ్యాయన్నారు. 482 మంది గృహనిర్మాణాలు చేపట్టగా, 362ఇళ్లు పూర్తయ్యాయని 120 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో రైల్వేగేటు ఆటంకంగా ఉండటంతో పాటు, డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు లేక చాలామంది ఇంటి నిర్మాణాలకు ముందుకు రావడం లేదు. పలువురు లబ్ధిదారులు వారి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ టీవీవీ సత్యనారాయణమూర్తి, ఏఈ ఎస్ఆర్‌వీ శ్రీకాంత్, ఏపీఎం బి.అప్పలకొండ, కార్యదర్శి బి.శిరీష ఉన్నారు.

బిక్కవోలు సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసబాబు బాధ్యతల స్వీకరణ

బిక్కవోలు, సెప్టెంబరు 28: బిక్కవోలు సబ్ రిజిస్ట్రార్‌గా సీహెచ్ శ్రీనివాసబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొత్తపేట నుంచి బదిలీపై బిక్కవోలు వచ్చారు. ఇప్పటి వరకూ పనిచేసిన కేవీఎస్ కుమారి అలమూరుకు బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన శ్రీనివాసబాబుకు సిబ్బంది, లేఖర్లు ఘనంగా స్వాగతం పలికారు.

కోరుకొండ సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్

కోరుకొండ, సెప్టెంబరు28: కోరుకొండ సబ్ రిజిస్ట్రార్‌గా డీవీవీఎంపీ శ్రీనివాసు బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ప్రస్తుతం కోరుకొండ సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చారు. ఇప్పటివరకు కోరుకొండ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఐ.ప్రసాద్ సీతానగరం మండలం సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వెళ్లారు. అదేవిధంగా కోరుకొండ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు సీనియర్ అసిస్టెంట్‌గా పద్మావతి పిడుంగొయ్యి నుంచి వచ్చారు.

తంటికొండ వెంకన్న ఈవోగా సత్యనారాయణ

గోకవరం, సెప్టెంబరు 28: గోకవరం మండలం తంటికొండ శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వడ్డాది సత్యనారాయణ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన కాకినాడ జగన్నాధపురం గ్రూపు దేవాలయాల ఈవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఈవోగా పనిచేసిన గండి లక్ష్మీకుమార్ కోరుకొండ మిర్యాలవారి సత్రంకు బదిలీ అయ్యారు. నూతన ఈవో సత్యనారాయణకు దేవస్థానం మాజీ ఛైర్మన్ బదిరెడ్డి అచ్చన్నదొర, సాధరంగా ఆహ్వానించారు.

రంగంపేట డిప్యూటీ తహశీల్దార్‌గా రంజిత్‌కుమార్

రంగంపేట, సెప్టెంబరు 28: రంగంపేట మండలం డిప్యూటీ తహశీల్దార్‌గా యు.రంజిత్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మండలంలో గల కూటమి నాయకులు, వీఆర్వోలు, మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆయన పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన శశిధర్ పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

మహేంద్రవాడలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

అనపర్తి, సెప్టెంబరు 28: అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలో శనివారంరాత్రి మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి నట్లు ఎస్‌ఐ శ్రీను నాయక్ తెలిపారు. గ్రామానికి చెందిన కర్రి నాగిరెడ్డి తన ఇంట్లో ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి తీసుకువచ్చిన మద్యం సీసాలను విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడులు నిర్వహించామని అతనివద్ద 12 క్వార్టర్ బాటిళ్ళు, 1 ఫుల్ బాటిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీను నాయక్ తెలిపారు.

'మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత'

అనపర్తి సెప్టెంబరు 28: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని అనపర్తి సీఐ పి.శివగణేష్ అన్నారు. శనివారం అనపర్తిలో సీఐ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించి వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకుని వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నెంబరు బోర్డులు లేని వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

'భావవ్యక్తీకరణకు నైపుణ్యం ఎంతో అవసరం'

దివాన్‌చెరువు, సెప్టెంబరు 28 : సమాజంలో ఏ రంగంలో ఉన్నవారికైనా భావవ్యక్తీకరణ నైపుణ్యాలు ఎంతో అవసరమని గైట్ అటానమస్ కళాశాల లెర్నింగ్ అండ్ డవలప్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ భానుప్రకాష్ అన్నారు. ఉన్నత భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా దివాన్‌చెరువులోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని 9, 10వ తరగతి విద్యార్థులకు భావవ్యక్తీకరణ నైపుణ్యంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ తమ మనస్సులోని విషయాలను సమర్థవంతంగా చెప్పేకళే భావవ్యక్తీకరణ నైపుణ్యమని తెలిపారు. గైట్ అటానమస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్వీవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఆటోమొబైల్ రంగంలో వాహనాల సామర్థ్యం అవి పనిచేసే విధానం వివరించారు. ద్విచక్రవాహనంలోని వివిధ విడి భాగాలు వంటి పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం వి.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువుల వాడకంపై అవగాహన : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గైట్ అటానమస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వెలుగుబంద లోని ఎంపీ యూపీ పాఠశాల విద్యార్థులకు, నరేంద్రపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకుఅవగాహన కల్పించారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

వ్యాయామంతో గుండె పదిలం: ఎస్పీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ దురలవాట్లకు దూరంగా ఉంటూ వ్యాయామం చేయడం గుండెను కాపాడుతుందని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కిమ్స్ ఆస్పత్రి వైద్యులు, పోలీసుశాఖ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కిమ్స్ హాస్పటల్ నుంచి పుష్కరఘాట్ వరకూ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. దురలవాట్లకు స్వస్తిచెప్పి రోజుకు కనీసం గంటపాటు వ్యాయామం చేయడం అలవాటుగా చేసుకుంటే గుండెను ఆరోగ్యంగా ఉంచవచ్చని ఎస్పీ చెప్పారు.

'ఒకే దేశం, ఒకే ఎన్నిక ఆచరణ సాధ్యంకాదు'

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న ఒకే దేశం, ఒకే ఎన్నిక భారతదేశంలో ఆచరణ సాధ్యం కాదు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. జమిలీ ఎన్నికలు నియంతృత్వానికి దారి తీస్తాయని పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఊర్వశి సెంటర్ వద్ద సీపీఐ కూరగాయల సెక్షన్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వనజ మాట్లాడుతూ భారత దేశం భిన్న మతాలు, భిన్న కులాలకు, భిన్న సంస్కృతులు, బహుళ రాజకీయ ప్రాంతీయ పార్టీలతో కూడిన వైవిధ్యభరితమైనదని అన్నారు. అంతకుముందు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా భగత్‌సింగ్, లెనిన్ విగ్రహాలకు జాతీయకార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జట్ల సంఘం అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ, జట్ల సంఘం, రైతు సంఘం, కూరగాలయ సెక్షన్ నాయకులు పాల్గొన్నారు.

'ప్రపంచ శ్రేయస్సు కోసమే భారతీయత'

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28 : భారతీయత అనేది కేవలం భారతీయుల కోసమే కాదని, అది ప్రపంచ శ్రేయస్సు కోసమని ఆదికవి నన్నయ యూనివర్శిటీ డీన్ కొట్టి శ్రీరమేష్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఫిలాసఫీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక ప్రసంగం నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న శ్రీరమేష్ మాట్లాడుతూ వలస వాద భావజాలానికి వ్యతిరేకంగా భారతీయ భావవాదాన్ని పాశ్చాత్యులకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో భారతీయ బౌద్ధిక, మానసిక స్వేచ్ఛ కోసం విజ్ఞాన ఉద్యమాన్ని సర్వేపల్లి రాధాకృష్ణన్ సాగించారని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఏ ఇతర కళాశాలలో లేనటువంటి అరుదైన కోర్సులను ఆర్ట్స్ కళాశాల అందిస్తున్నదని అన్నారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేశారు. కళాశాల ఫిలాసఫీ డిపార్టుమెంట్ ఇన్‌ఛార్జి కె.సీతామహాలక్ష్మి, అధ్యాపకులు ఎం.పార్థసారథి, సత్యం సూర్యనారాయణ, నూజిళ్ల శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా జయంతి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ పి.విజయకుమార్ మాట్లాడుతూ పామరులకు పద్యాలతో పట్టం కట్టిన కవి జాషువా అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, తెలుగుశాఖ అధిపతి సుబ్బలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రక్కన గల ఆదిత్య డిగ్రీ కలాశాలలో కళాగౌతమి, తెలుగు సారస్వత పరిషత్ సాహిత్య సంస్థల ఆధ్వర్యంలో జాషువా జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సభకు ఆదిత్య ప్రిన్సిపాల్ సిహెచ్‌ఫణికుమార్ అధ్యక్షత వహించగా, బీఎస్‌మూర్తి తొలి పలుకుల పలికారు. కళాగౌతమి బిఎస్‌మూర్తి మాట్లాడుతూ, కులమతాలకతీతంగా జాషువా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఐన బాలచందర్ సాదే,రమాదేవి, కళాగౌతమి సభ్యులు, కవి ఓబులేసు, ఉత్తమ రైతు రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగుల చెరువు మార్కెట్ కమిటీ ఎన్నిక

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 28: స్థానిక మున్సిపల్ స్టేడియం నాగులచెరువు లక్ష్మీగణపతి ఆలయంవద్ద మార్కెట్ పెద్దల సమక్షంలో నాగులచెరువు మార్కెట్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కోళ్ళ కృష్ణచైతన్య, ఉపాధ్యక్షుడిగా కల్లి నరేష్‌రెడ్డి, కార్యదర్శిగా బిసపు నాగబాబు, సంయుక్త కార్యదర్శిగా త్రిష్టి సతీష్‌కుమార్, కోశాధికారిగా బూర నీలకంఠం,మొల్లి సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆతవ అప్పారావు ఎన్నికయ్యారు.

వెంకటేశ్వరస్వామి ఆస్తులు కబ్జా చేశారు

• జగన్‌పై మండిపడ్డ రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 28: తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ఆస్తులను కబ్జాచేసిందని వైసీపీ వాళ్లేనని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యేగోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం క్రైస్తవ మతం తీసుకున్నారని అందరికీ తెలుసునన్నారు. కచ్చితంగా డిక్లరేషన్ ఇచ్చే స్వామివారిని దర్శించుకోవాలన్నారు. గత ఐదేళ్లలో నిబంధనలు పక్కన పెట్టి ఇష్టానుసారం తిరుమలలో తిరిగిన జగన్ ఇప్పుడు డిక్లరేషన్ అంటే బాధఎడుతున్నాడని అన్నారు. జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాప్తిజం తీసుకోలేదని కావాలనే జగన్ అండ్‌కో బోగస్ ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నేత వినుకొండ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, పిన్నింటి రవిశంకర్ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28: రాజమహేంద్రవరం మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు రాష్ట్ర సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం విజయవాడ టీడీపీ సెంట్రల్ కార్యాలయానికి వెళ్లిన ఆదిరెడ్డి సీఎం చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పలు అంశాలపై వారు చర్చించారు.

గాన కోకిల లతా మంగేష్కర్ జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్ సెప్టెంబరు28: మధుర గాయని, భారతరత్న లతా మంగేష్కర్ 96వ జయంతిని శనివారం సాయంత్రం స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదిక నందు జరిగింది. ఈ కార్యక్రమానికి నట గాయకుడు జిత్‌మోహన్‌మిత్ర అధ్యక్షత వహించగా, సీహెచ్ విశ్వనాథ్ జ్యోతి ప్రజ్వలన గావించారు. జిత్‌మోహన్ మిత్ర మాట్లాడుతూ పెద్దచదువులు చదువుకోకపోయినా, లతాజీ సంగీతం మీద, పాటలమీద మక్కువతో రాణించారన్నారు. 30సంవత్సరాలుగా తబలాకారుడిగా ఆర్కెస్ట్రాలో సేవలందించిన వి.నాగేంద్రను లతాజీ పురస్కారంతో సత్కరించారు. వంకా బాలకృష్ణ, నళిని, జివిఎస్, లక్ష్మీతులసి, హరివ, గుంటూరి శ్రీనివాస్, పద్మలత, కృష్ణ, లతాజీ హిట్ పాటలను పాడిశ్రోతలను అలరించారు.

పేపరుమిల్లు రోడ్డులో ఆక్రమణల తొలగింపు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28: రాజమహేంద్రవరంలో ఆక్రమణల తొలగింపు పనులు సాగుతున్నాయి. జాంపేట, ఆజాద్‌చౌక్‌లలో డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించారు. పేపరుమిల్లురోడ్డులోని ఈఎస్ఐ ఆసుపత్రి మొదలుకొని దుర్గమ్మతల్లి ఆలయం వరకు రోడ్డుకిరువైపుల డ్రైనేజీలపై ఆక్రమణలను తొలగించారు. ఈరోడ్డు ఇరుకుగా మారడంతో డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించారు. రాజమహేంద్రవరంలో ప్రవేశించే రహదారులు, గోదావరిరేవులకు అనుసందానంగాఉన్న రహదారులు, ప్రధాన రహదారులలో ఆక్రమణలు తొలగించే చర్యలు చేపట్టారు.

జీజీహెచ్‌లో స్కానింగ్ సేవలు, ఆర్థో ఇంప్లాంట్స్ సరఫరాకు దరఖాస్తుల స్వీకరణ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)కి వైద్యం కోసం వచ్చే రోగులకు ఎన్‌టీఆర్ వైద్య సేవాపథకం (ఆరోగ్యశ్రీ)లో అవసరమైన పలు రకాలైన స్కానింగ్ సేవలను అందజేయడానికి రాజమహేంద్రవరంలోని అర్హత కలిగిన స్కానింగ్ సెంటర్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ తెలిపారు. ఆర్థో విభాగానికి కావాల్సిన ఆర్థో ఇంప్లాంట్స్‌ను సరఫరా చేయడానికి అర్హత కలిగిన సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. వివరాలకు రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబరు 18వ తేదీ వరకూ అన్ని పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు. మేనేజర్ సెల్ నెం. 9491040295లో సంప్రదించాలని పేర్కొన్నారు.



ఆదివారం ప్రత్యేకం

కొత్త బంగారు లోకం!

కొత్తబంగారు లోకం.. మీకు అవుతుంది సొంతం.. బంగారం కొనుగోలు చేయలేకపోతున్నామనే బాధెందుకు.. ప్రత్యామ్నాయం వచ్చేసిందండోయ్.. 24 క్యారెట్.. 22 క్యారెట్ బంగారు వస్తువులనే కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు.. అచ్చంగా బంగారంలా కనిపించే వెండిపై గోల్డ్ కోటెడ్ ఆభరణాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి.. అదీ కొనలేరా.. ఇమిటేషన్ జ్యూయలరీ ఉండనే ఉందిగా.. మన బడ్జెట్ మేరకు అందమైన వస్తువులను తీసుకోవచ్చు.. అలంకరించుకోవచ్చు.. మనసును కుదుటపరచవచ్చు.. అదీ కాదంటారా.. ఒక ఏడాది ఆగారంటే.. ఏకంగా తులం రూ.20 వేలకే అచ్చంగా స్వచ్ఛమైన బంగారం కొనేయ వచ్చు.. అదెలాగంటారా.. సామాన్యులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం 9 క్యారెట్ గోల్డ్ అందుబాటులోకి తీసుకురానుంది.. ధర తులం రూ.20 వేల ఉండొచ్చని అంచనా.. ఇంకెం దుకు ఆలస్యం ఏ బంగారం కొంటారో ఆలోచించుకోండి మరి!

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/
(రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

మెరిసేదంతా బంగారం కాదండోయ్..

ఎంత కొన్నా ఇంకా ఇంకా కొనాలనిపించేది బంగారం.. మోజు తగ్గదు.. ఆకర్షణ ఆగదు.. ఆ మెరుపునకు చిక్కితే ఇక అంతే. ఎంతున్నా ఇంకా ఇంకా కావాలని పిస్తూనే ఉంటుంది..మహిళలకైతే పసిడి అంటే మహాపిచ్చి. ధనవంతులకైతే ఇదో స్టేటస్ సింబల్.. పేదోళ్లకు అత్యవస రానికి ఆదుకునే వస్తువు..ఒక రకంగా చెప్పాలంటే పసిడి సురక్షిత పెట్టుబడి సాధనం.. ఇంట్లో ఆడపిల్ల ఉన్న తల్లిదం డ్రులైతే పిల్ల పెళ్లికి బంగారం కోసం ఎన్నో ఆశలు పెట్టుకుం టారు..ముందునుంచే కొంచె కొంచెం కొని కూడబెడతారు. ఇప్పుడా పసిడి పట్టపగ్గాల్లే కుండా పరుగెడుతోంది. రెండు నెల ల కిందట తగ్గినట్లే తగ్గి ఇప్పుడు ఆల్‌టైం హై రేటుకు ఎగబా కింది.దీంతో జిల్లాలో పసిడి అమ్మకాలు గణనీయంగా తగ్గిపో యాయి.ఈ తరుణంలో కేంద్రం కొత్తగా తేవాలనుకుంటోన్న 9 క్యారెట్ గోల్డ్‌పై సామాన్యులు ఆశలు పెంచుకున్నారు. మరి కొందరు పసిడి ప్రియులైతే పెరిగిన ధరలు భరించ లేక గోల్డ్ కోటెడ్ ఉన్న సిల్వర్ ఆభరణాలు కొంటున్నారు.అసలు బంగారు ఆభరణాలకంటే రెట్టింపు డిజైన్లు దొరుకుతున్నాయి. దీంతో వీటిని కొంటుండడంతో ఈ వ్యాపారం జోరందుకుంది.

1963లో 24 క్యారెట్స్ తులం బంగారం	రూ.63.25
1964	రూ.63.25
1970	రూ.184
1980	రూ.1,330
1990	రూ.3,200
2000	రూ.4,400
2010	రూ.18,500
2020	రూ.48,651
2024	రూ.75,640

‘తరుగ’ని దోపిడీ.. మజూరీతో బేజారు

బంగారం వస్తువులు, ఆభరణాల కొనుగోలులో కాస్త మాయ ఉంటుంది. తరుగు, మజూరీలో కొందరు వర్తకులు ఎంతో కొంత బురిడీ కొట్టిస్తుంటారు.నగిషీలు ఎక్కువగా కావాలంటే తరుగు కూడా ఆ పరిమాణంలోనే ఉంటుంది. ఇవాళ 5 నుంచి 25శాతం వరకూ కూడా తరుగు వేస్తున్నారు. జిగేల్‌మనే పగడాలతో, కళ్లు మిరుమిట్లు గొలిపే రాళ్లతో, ఆకట్టుకునే రంగులతో ఉన్న వస్తువుల్లో బంగారం ఎంత ఉందో చెప్పడం కష్టం. ఇదే అదనుగా వీటిలో భారీ దోపిడీ జరుగుతోంది. ఎక్కువగా బరువు ఉండే రాళ్లు, ముత్యా లు వంటి వాటిని వాడి కొందరు వ్యాపారులు దోచేస్తున్నారు.

సామాన్యుడికి బంగారం లాంటి కబురు..



9 క్యారెట్ వస్తోంది..

ఒకపక్క బంగారం ధరలు భారీగా పెరిగిపోతూ సామాన్యుడు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోయింది. మరోపక్క బంగారం విలువ అధికంగా ఉండడంతో వీటిని ధరించే మహిళలపై రోజు రోజుకు నేరాలు పెరిగి పోతున్నాయి.ఒంటిపై ఉన్న ఆభరణాలు తస్కరించడం, కొన్నిసార్లు చంపేసి లాక్కుపోతున్న పరిస్థితులు పెరిగి పోతుండడంతో కొత్తగా 9 క్యారెట్ బంగారు ఆభరణా లను దించాలని కేంద్రం ఆలోచి స్తోంది. ఇది వచ్చే ఏడాదిలోగా కార్యరూపం దాల్చే అవకాశం ఉంది.వాస్తవానికి ఇప్పుడు ప్రతిఒక్కరూ 22 క్యారెట్ విభాగం లో 916 హాల్ మార్క్ ఆభరణాలే వినియోగిస్తున్నారు. ఇందు లో 91.67 శాతం బంగారం ప్యూరిటీ ఉంటుంది. 8.33 శాతం కాపర్, సిల్వర్ కలుపుతారు. 22 క్యారెట్ల బంగారం గ్రాము ప్రస్తుతం రూ.7,100కు ఎగబాకి కొనలేని పరిస్థితులు తలెత్తా యి.దీంతో కొత్తగా 9 క్యారెట్‌తో బంగారు ఆభరణాలను కేంద్రం దించబోతోంది.ఇందులో బంగారం కేవలం 37.5 శాతమే ఉంటుంది. 42.5 శాతం సిల్వర్, 20 శాతం కాపర్ ఉంటుంది. ఇతర లోహాలు ఎక్కువ మోతాదులో కలపడం వల్ల 9 క్యారె ట్ బంగారం ధర తులం రూ.20 వేలకే వచ్చేయనుంది. అంటే 22 క్యారెట్ అయితే తులం రూ.71 వేలు ఉంది. తద్వా రా 9 క్యారెట్ బంగారానికి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. 9 క్యారెట్‌లో పసిడి తక్కువగా కలుస్తుంది కాబట్టి అంతగా ఆకర్షణీయంగా కనిపించక పోవచ్చనే వాదన ఉంది. మరోపక్క చాలా మంది బంగారాన్ని పెట్టుబడి సాధనంగా చూస్తారు కాబట్టి దీనిపై ఎంతవరకు మొగ్గుచూపుతారనేది చూడాలి.

- బంగారం ధర దూకుడు
- రోజురోజుకు పెరుగుదల
- పడిపోయిన అమ్మకాలు
- ఉమ్మడి తూర్పున 1,200 దుకాణాలు
- 50కిపైగా కార్పొరేట్ బ్రాంచ్‌లు
- నాడు రోజుకు రూ.40 కోట్ల విక్రయాలు
- ఇప్పుడు రూ.22 కోట్లే
- త్వరలో కేంద్రం 9 క్యారెట్ ఆభరణాలు
- తులం రూ.20వేలకే బంగారం
- సామాన్యుల్లో కొంగొత్త ఆశలు
- బంగారం కోటెడ్ సిల్వర్ ఆభరణాలకు క్రేజ్
- ఇమిటేషన్ జ్యూయలరీకి డిమాండ్



తగ్గి పెరిగిన ధర..

కేంద్రప్రభుత్వం జూలైలో పసిడిపై కస్టమ్స్ ట్యాక్స్ తగ్గించడంతో ధరలు ఒక్కసారిగా తగ్గాయి. గ్రాము రూ.6,900 నుంచి క్రమేపీ రూ.6,300 వరకు పడిపోయింది.దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్కసారిగా కొనుగోళ్లు పెరిగాయి. ఒక్క వారంలో కొనుగోళ్లు రూ.550కోట్ల వరకు జరిగాయి. బంగారం కొనుగోళ్లకు సంబంధించి వార్షిక ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఏకంగా రూ.800కోట్ల వరకు వెళ్లాయి. అయితే గత నెలరోజులుగా బంగారం పరుగు పెడుతూనే ఉంది. రెండు రోజుల కిందట శుక్రవారం 22 క్యారెట్ల బంగారం ఏకంగా రూ.7,100 వరకు ఎగబాకింది. అటు ఆల్‌టైం గరిష్ఠానికి ధరలు పెరగడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొను గోళ్లు సగానికి సగం పడిపోయాయి.

సగానికి పడిపోయిన అమ్మకాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1,200 వరకు బంగారు ఆభరణాల విక్రయ దుకాణాలున్నాయి. ఇందులో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, మండపేట, పెద్దాపురం పట్టణాల్లో అధికంగా ఉన్నాయి. వీటన్నింటిలో రోజుకు ధరలు తగ్గిన సమయంలో రూ.40 కోట్ల వరకు అమ్మకాలు జరిగేవి. సగటున ఒక్కో దుకాణం రోజుకు 225 గ్రాముల వరకు విక్రయించేవి. ఇప్పుడు రోజువారీ విక్రయాలు రూ.22 కోట్లకు పడిపోయాయి. ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్ బంగారం దుకాణాలు అన్ని బ్రాంచ్‌లు కలిపి 50 వరకు ఉన్నాయి. వీటిలో సీజన్ సమయంలో రోజుకు రూ.55 కోట్ల వరకు విక్రయాలు జరిగేవి. ఇప్పుడు ధరాభారంతో రూ.33 కోట్ల వరకు జరుగుతున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పసిడి వర్తక సంఘం విశ్లేషించింది.

సిల్వర్‌తో ధగధగలు..



గోల్డ్ కోటింగ్‌తో కూడిన సిల్వర్ ఆభరణాలు ఈ మధ్య మార్కెట్లో భారీగా దొరుకుతున్నాయి. గోల్డ్ కోటింగ్‌లా అసలే మాత్రం కనిపించకుండా అచ్చంగా బంగారు ఆభరణాల్లాగే ఉంటున్నాయి. గాజులు, నెక్లెస్, వడ్డాణం, చెవి రింగులు ఒక టేంటి అసలు బంగారు ఆభరణాల కంటే వీటిలోనే వందల కొద్దీ మోడళ్లు లభ్యమవుతున్నాయి. ధరిస్తే అసలు బంగారం లాగే ఇవి నిగనిగలాడుతాయి. పైగా వీటిని కొనుగోలు చేస్తే ఏడాది లేదా ఒక నెలలోనే తిరిగి అదే దుకాణానికి ఇచ్చేస్తే కొనుగోలు ధరలో 55 శాతం బైబ్యాక్ ఆభరణాల రూపంలో ఇస్తున్నారు. అనేక దుకాణాల్లో ఇదే విధానం అమలవుతోంది. దీంతో నచ్చిన ఆభరణాలను మహిళలు కొనుగోలు చేసి తిరిగి కొద్దినెలలకే అవి వెనక్కు ఇచ్చి కొత్తవి తీసుకుంటున్నారు. తద్వారా పసిడి ధరల పెరుగుదల భారం నుంచి బయట పడుతున్నారు. కాకినాడలో త్వరలో గోల్డ్‌కోటెడ్ సిల్వర్ ఆభరణాలు విక్రయించడానికి ఓ కార్పొరేట్ కంపెనీ షోరూం కూడా ప్రారంభించబోతోంది. 22 క్యారెట్ ఆభరణాల దగ్గర నుంచి వన్‌గ్రాం గోల్డ్, గోల్డ్‌కోటెడ్ సిల్వర్ ఆభరణాలు సైతం భారీగా ఆన్‌లైన్‌లో లభ్యమవుతున్నాయి. అనేక మంది మహిళలు ఆన్‌లైన్ ఆర్డర్ ద్వారా రప్పిస్తున్నారు. ఈ మార్కెట్ జిల్లాలో రూ.25కోట్ల వరకు ఉంటుందని అంచనా.

బంగారం ఎలా వస్తుందో తెలుసా..?

- ఆభరణాల తయారీకి బంగారం ఎక్కడినుంచి వస్తోందా తెలుసా? ప్రముఖ కార్పొరేట్ కంపెనీలైనా, చిన్న దుకాణాలైనా కచ్చితంగా బంగారం బిస్కెట్ కొని వీటి నుంచి ఆభరణాలు తయారు చేస్తాయి. నేరుగా విదేశాల నుంచి ఈ బిస్కెట్లు తేవడానికి లేదు. బ్యాంకుల ద్వారా మాత్రమే బిస్కెట్లు, కడ్డీలు కొనుగోలు చేయాలి. జిల్లాలో అనేక కంపెనీలు బ్యాంకుల నుంచి అరకిలో, కిలో 24 క్యారెట్ బిస్కె ట్లు కొంటాయి.కేంద్రప్రభుత్వ పరిధిలోని ఎంఎంటీసీ అనే సంస్థ నేరుగా విదేశాల నుంచి బంగారం బిస్కెట్లు, నాణేలు కొని బయట విక్రయిస్తుంది. ఎంఎంటీసీ నుంచి ఎవరైనా వీటిని కొనుగోలు చేసుకోవచ్చు.
- బంగారం మెత్తగా ఉండి బాగా సాగే గుణం కలిగి ఉంటుంది.వెంట్రుక కంటే సన్నగా సాగదీసినా గట్టిదనం తగ్గదు.ఒక ఔన్సు బంగారాన్ని 300 చదరపు అడుగుల రేకుగా సాగదీయవచ్చు. ఒక గ్రాము బంగారాన్ని ఒక చదరపు మీటరు వైశాల్యం కలిగిన రేకుగా లేదా 20 మైక్రో మీటర్ల మందం ఉన్న 165 మీటర్ల పొడవాటి తీగలా చేయవచ్చు.
- బంగారాన్ని నాణేలు, వస్తువులు, ఆభరణాలు తయారు చేయడం దగ్గర నుంచీ వాడకం విపరీతంగా పెరిగింది. 1930 నుంచి నాణేల చలామణీని ఆపేశారు.
- 2012 నాటికి ప్రపంచంలో 2లక్షల టన్నుల బంగారం ఉత్పత్తి జరిగింది.
- బంగారం స్వచ్ఛతను ఫైన్నెస్ లేదా క్యారెట్లలో కొలుస్తారు.బరువును ట్రాయ్ ఔన్సుల్లో లెక్కిస్తారు.ఒక ట్రాయ్ ఔన్సు అంటే మన పరిభాషలో కిలోన్నర బంగారం.
- బంగారపు దారాలను దుస్తుల ఎంబ్రాయిడరీకి వినియోగిస్తారు.టీవీలు,కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల్లో స్వల్పంగా బంగారాన్ని ఉపయోగించవచ్చని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేసింది.
- బంగారంలో 24 క్యారెట్స్ ప్యూరిటీ కాగా ఆభరణాల తయారీలో 22 క్యారెట్స్ వినియోగిస్తారు. ఏ ఆభరణమైనా 22 క్యారెట్ ప్యూరిటీ గోల్డ్‌తో మాత్రమే తయారు చేస్తారు. 18 క్యారెట్ బంగారం కూడా ఉంది. డైమండ్స్ తయారీలో ఈ బంగారాన్ని ఉపయోగిస్తారు. త్వరలో 9 క్యారెట్ బంగారం అందుబాటులోకి రానుంది.అదే వస్తే ధరలు తగ్గుతాయి.





అచ్చంగా బంగారమే..

ఒకపక్క పసిడి కొనలేనంతగా పెరగడంతో ఉమ్మడి జిల్లాలో మహిళలు వన్ గ్రాం గోల్డ్‌తో తయారు చేసిన ఇమిటేషన్ ఆభరణాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. రోజువారీగా ధరించడానికి నల్లపూసలు, గాజులు తదితర వన్ గ్రాం ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వస్తువులకు మహా డిమాండ్ ఉంది. ప్రస్తతం ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక వన్‌గ్రాం గోల్డ్ షోరూమ్‌లు వెలుస్తున్నా యంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. చివరకు పెళ్లిళ్లు, పుట్టినరోజుల వేడుకల్లోను బహుమతుల కింద ఈ ఆభరణాలే ఇస్తున్నారు.

ఇసుక సరఫరాకు 2.0 వెర్షన్ సాఫ్ట్‌వేర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 28: ఇసుక సరఫరాకు 2.0 వెర్షన్ సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఇసుక నిర్వహణ వ్యవస్థ (ఏపీఎస్ఎంఎస్), టెక్నికల్ స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ) ప్రక్రియపై ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన శిక్షణలో దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 9 ఇసుక రీచ్‌ల ద్వారా ఇసుకను ప్రజలు, వినియోగదారులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఇసుక సరఫరా చేసే ప్రతి వాహనానికి తప్పనిసరిగా జియోట్యాగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో 9 రీచ్‌లకు విధుల్లో భాగంగా రెండు షిఫ్టుల విధానంలో 18 మందిని నియమించామన్నారు. ప్రతి ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కలెక్టర్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో ఒక డిప్యూటీ తహశీల్దార్‌ను నియమించి పర్యవేక్షణ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఇన్‌చార్జి ఆర్‌డీవోలు కేఎల్ శివజ్యోతి, ఆర్.కృష్ణనాయక్, జిల్లా మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కండి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 28 : ధాన్యం సేకరణ వచ్చే నెలలో ప్రారంభించనున్న దృష్ట్యా.. క్షేత్రస్థాయిలో అక్టోబరు 2వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు సంబంధించి సమన్వయ శాఖల అధికారులు, మిల్లర్ల ప్రతినిధులతో సమీక్షించారు.ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాల మేరకు కొనుగోళ్లు చేపట్టడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో మిల్లుల సామర్థ్యం తనికీలు నిర్వహించి సోమవారం నాటికి నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో మిల్లర్ల ప్రతినిధులు కర్రి వెంకటరెడ్డి, మద్దూరి రామయ్య, గారా బాబూరావు, ఎస్ జనార్ధనరావు, మూర్తి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమాలకు అడ్డుకట్ట వేయండి

ఎక్సయిజ్ సూపరింటెండెంట్ లావణ్య ఆదేశం



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సారా అరికట్టడంతో పాటు మద్యంలో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిందేనని ఎక్సయిజ్ సూపరింటెం డెంట్ సీహెచ్ లావణ్య ఆదేశిం చారు.ఎక్సైజ్ సౌత్ స్టేషన్‌ని శనివారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలపై ఆరా తీశారు. నూతన ఎక్సయిజ్ పాలసీ, ప్రక్రియ తదితర అంశాలపై సిబ్బందికి అవగా హన కల్పించారు.స్టేషను భౌగోళిక పరిధి, నేరాల తీరు వంటి వాటిపై ఈఎస్‌కి ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ వివరించారు.



ఆకాశంలో అద్భుతః ఆకాశంలో శనివారం సాయంత్రం అద్భుతం ఆవిష్కృతమైంది.. కడియంలో మేఘం కమ్మిన వేళ ఇలా ఇంద్రధనస్సు ప్రత్యక్షమై సుందర దృశ్యంతో కనువిందు చేసింది.. - కడియం

సమాజ హితమే సాహిత్యం

నన్నయ ఉపకులపతి శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 27: సమాజ హితమే సాహిత్యం అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం, స్ఫూర్తి కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో ‘గురు విశ్వస్ఫూర్తి రచనలు-ఆధునిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక సామాజిక దృక్పథం’ అంశంపై శనివారం నిర్వహించిన తెలుగు జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు.ప్రస్తుత కాలంలో శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. కన్వీనర్, నన్నయ వర్సిటీ తెలుగు శాఖ సహాయాచార్యుడు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల నుంచి 350 మంది సదస్సుకు హాజరయ్యారన్నారు. 79 పరిశోధనా పత్రాలతో ‘సదస్సు వ్యాసావళి’ అనే పరిశోధనా గ్రంథాన్ని రూపొందించామన్నారు.ఈ కార్యక్రమంలో మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకర్,కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఎన్‌యూ పూర్వ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి,యోగి వేమన విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.ఈశ్వరరెడ్డి, స్ఫూర్తి కుటుంబం అథర్ ఎం.రజనీకాంతరావు, మేనేజింగ్ ట్రస్టీ వి.సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

తంటికొండ వీఏవో అదృశ్యం

తల్లి ఫిర్యాదు.. కేసు నమోదు

గోకవరం, సెప్టెంబరు 28 : గోకవరం మండలం తంటికొండ వ్యవసాయ సహాయకురాలిగా పనిచేస్తున్న గాలి దీప్తిస్వర్ణలత కనిపించడంలేదని ఆమె తల్లి మాండ్రు ప్రమీల శనివారం పోలీసులను ఆశ్రయించింది. గోకవరం గ్రామానికి చెందిన స్వర్ణలత గత కొన్నేళ్లుగా తంటికొండ వ్యవసాయ సహాయకురాలుగా పనిచేస్తోంది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పంట పొలాల నష్ట పరిహారం విషయంలో అధికారులు సక్రమంగా వ్యవహరించలేదంటూ అదే గ్రామానికి చెందిన పలువురు రైతు ప్రతినిధులు శనివారం ఆమెను నిలదీశారు. దీంతో స్వర్ణలత తీవ్ర మనస్తాపానికి గురై తల్లికి ఫోన్‌లో జరిగిన విషయాన్ని తెలియజేసింది.ఆ వెంటనే తల్లి ప్రమీల తంటికొండ గ్రామ సచివాలయానికి చేరుకొని కుమార్తె జాడ కోసం ప్రయత్నించగా అక్కడ ఆమె ఆచూకీ కానరాలేదు. జరిగిన సంఘటనపై స్వర్ణలత తల్లి ప్రమీల పోలీసు లను ఆశ్రయించి తన కుమార్తె ఆచూకీని వెంటనే కనుగొనాలని కోరారు.అంతే కాకుండా తన కుమార్తె పట్ల అమర్యాదగా ప్రవర్తించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.



చిరుత..ఎక్కడో! 8

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

దాడికి కారణమైన వారిని అరెస్టు చేయాలి

పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీ డిమాండ్

కొవ్వూరు, సెప్టెంబర్ 28: ఇటీవల కొవ్వూరు రాజీవ్‌కాలనీ వినాయకుని ఊరేగింపులో జరిగిన దాడికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీ సభ్యులు వేడంగి చిట్టిబాబు, నంబూరి శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. శనివారం పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీ రాజీవ్‌కాలనీ, శ్రీరామకాలనీల్లో సందర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా గాయపడిన వారిని పరామర్శించారు. దాడికి కారణమైన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని సూచించారు. పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీ సభ్యులు, రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ తెలిపారు.



గుర్రం జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయం

కొవ్వూరు, సెప్టెంబర్ 28: సమ సమాజ నిర్మాణానికి పాటుపడిన గుర్రం జాషువా నవయుగ కవి చక్రవర్తిగా పేరుగాంచారని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు ఎల్‌బీసీ సెంటర్‌లో జాషువా 129వ జయంతిని నిర్వహించారు. జాషువా విగ్రహానికి ఆయనతో పాటు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు నివాళులర్పించారు. ప్రజల్లోకి జాషువా రచనలను తీసుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్న, పెనుమాక జయరాజు తదితరులతో పాటు సంస్కృత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజీ, కె. రవివిక్రమ్, ప్రశాంతి తదితరులు జాషువా విగ్రహానికి నివాళులర్పించారు.

'డిక్లరేషన్ ఇచ్చేందుకు జగన్‌కు ఇష్టం లేదు'

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి ధ్వజం

కొవ్వూరు, సెప్టెంబర్ 28: తిరుమల వెంకటేశ్వరస్వామిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వడానికి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఇష్టం లేదని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆరోపించారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం పాత్రికేయులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్యమతస్థులు తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తే డిక్లరేషన్ ఇవ్వడం ఆచారంగా వస్తున్నదన్నారు. డిక్లరేషన్ ఫారంలో సంతకం పెట్టడానికి వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. లడ్డూ తయారీలో కల్తీ జరిగిందని ల్యాబ్ రిపోర్టులు వచ్చిన తర్వాతే కూటమి నాయకులు స్పందించారన్నారు. తప్పు చేయకపోతే సీబీసీఐడీ విచారణ ఎందుకు కోరడం లేదన్నారు. వెంకటేశ్వరస్వామిపై విశ్వాసం ఉంటే విచారణకు ఒప్పుకుని కల్తీ జరగడానికి కారణమైన అధికారులు, ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవడానికి సహకరించాలన్నారు. సమావేశంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, కాకర్ల సత్యేంద్ర పాల్గొన్నారు.



వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డును పునఃప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ పునఃప్రారంభం

తాళ్లపూడి, సెప్టెంబరు 28: విజన్ 2047 కార్యక్రమాల నిర్వహణలో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీల వద్ద గ్రామసభలు నిర్వహించారు. ఇప్పటి వరకు పూర్తి కాని ఇళ్ల నిర్మాణానికి స్త్రీ నిధుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామని అధికారులు తెలిపారు. డిసెంబర్‌లోగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి వెంటనే బిల్లు చెల్లిస్తామని అధికారులు తెలిపారు. విజన్ 2047లో భాగంగా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డులను పునఃప్రారంభించారు. వర్మి కంపోస్టు ద్వారా పంచాయతీలకు ఆదాయం పెంచేలా తీర్మానించారు. ఆయా గ్రామసభల్లో సర్పంచులు, కార్యదర్శులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో పరిసరాలు శుభ్రం చేస్తున్న డ్వాక్రా మహిళలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెరవలి, సెప్టెంబరు 28: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డ్వాక్రా మహిళలు, ఆసుపత్రి సిబ్బంది పరిసరాల శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వాక్రా సీసీ కనకదుర్గ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు.



వినాయక ఆలయం వద్ద జగన్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న టీడీపీ

ఆవు పాలతో వినాయక ఆలయం శుద్ధి

నల్లజర్ల, సెప్టెంబర్ 28: నల్లజర్ల వరసిద్ధి వినాయక ఆలయంలో వైసీపీ వర్గీయులు కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేయడంతో టీడీపీ నాయకులు శనివారం సాయంత్రం ఆ ప్రాంతాన్ని శుద్ధి చేశారు. ఆవు పాలతో అభిషేకం చేసి జగన్ చిత్రపటాలను దహనం చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన మాజీ సీఎం జగన్‌కు పుట్టగతులు ఉండవన్నారు. కార్యక్రమంలో వల్లూరి సత్తిపండు, రావూరి రమణ, కోడూరి నారాయణ, చింతా చైతన్య, సవలం రామకృష్ణ, ఎం.తాతారావు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే పూజలు

కొవ్వూరు, సెప్టెంబర్ 28: రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో వైసీపీ కార్యకర్తలు పూజలు చేస్తున్నట్టు కొవ్వూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. శనివారం కొవ్వూరు పట్టణంలోని బసివిరెడ్డిపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన 105 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కోడూరి శివరామకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కంటమణి రమేష్‌బాబు, దేవగుప్తాపు లక్ష్మణరావు, చిట్టూరి అన్నవరం తదితరులతోపాటు మున్సిపల్ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు

నల్లజర్ల, సెప్టెంబరు 28: నల్లజర్ల వరసిద్ధి వినాయక ఆలయంలో వైసీపీ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డులో ఉపయోగించే నెయ్యి కల్తీ లేదని రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు వైసీపీ నాయకులు కారుమంచి రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో చుండ్రు సురేష్, నక్కా పండు, అచ్యుత శివాజీ, మద్దూరి నాగేశ్వరావు, జోగుసీదు నాగు, చిక్కం గంగరావు, చోడసాని రాంబాబు, తానిగడప శ్రీను పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో స్కానింగ్ సేవలు, ఆర్థో ఇంప్లాంట్స్ సరఫరాకు దరఖాస్తుల స్వీకరణ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28: రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)కి ఎన్‌టీఆర్ వైద్య సేవా పథకం(ఆరోగ్యశ్రీ)లో అవసరమైన పలు రకాలైన స్కానింగ్ సేవలను అందజేయడానికి అర్హత కలిగిన స్కానింగ్ సెంటర్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ తెలిపారు. వివరాలకు రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబరు 18వ తేదీ వరకూ అన్ని పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

గోదావరి పుష్కరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు. పాల్గొన్న కౌన్సిలర్లు

కొవ్వూరు, సెప్టెంబర్ 28: రాబోయే గోదావరి పుష్కరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు దేశ, విదేశాల నుంచి పట్టణానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో మున్సిపల్ పాలకవర్గం, అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. పుష్కరాల్లో రాజమహేంద్రవరం కంటే కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి భక్తులు ప్రాధాన్యత ఇస్తారన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులను అంచెలంచెలుగా చేపట్టాలన్నారు. పట్టణవాసులకు గోదావరి నీటిని శుద్ధిచేసి అందించడానికి సంబంధిత మంత్రి, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపాల్టీలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి మున్సిపల్‌శాఖా మంత్రికి అందించామన్నారు. ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ ప్రాపర్టీ ట్యాక్స్ డిమాండ్ పెరిగేలా సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకోవాలన్నారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కమీషనర్ నాగేంద్రకుమార్‌కు సూచించారు. కౌన్సిలర్ కంటమణి రమేష్‌బాబు, టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్న, బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కోడూరి శివరామకృష్ణ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

తెలుగుజాతి ప్రతిష్టను ప్రపంచానికి చాటిన ఎన్‌టీఆర్

ఎమ్మెల్యే మద్దిపాటి



దుద్దుకూరులో ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, సెప్టెంబరు 28: తెలుగుజాతి ప్రతిష్టను ప్రపంచానికి తెలియజేసిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో శనివారం ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. దుద్దుకూరు గ్రామానికి చెందిన కోమటి సూర్యనారాయణ సొంత నిధులతో ఏర్పాటు చేసుకున్న విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, కంటిపూడి సుబ్బారావు, ముళ్ళపూడి దొరాజీ, కరుటూరి ధనుంజయుడు, కోమటి నరసింహమూర్తి, దుద్దుపూడి హరిబాబు, గ్రామ సర్పంచ్ బొంతా నాగమణి తదిత రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మద్దిపాటి అన్నారు. దేవరపల్లి మండలంలో శనివారం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. దేవరపల్లి మండలంలోని యర్నగూడెం, సంగాయిగూడెం, చిన్నాయిగూడెం, యాదవోలు, బంధపురం, దుద్దుకూరులో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజీలకు ఆయన భూమిపూజ చేశారు. యాదవోలులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పెనుమత్స సుబ్బరాజు, గద్దే శ్రీనివాస్, గడా మురళీ అజిత్‌కుమార్, ముమ్మిడి సత్యనారాయణ, పిన్నమనేని సత్యనారాయణ, నుదురుమాటి శ్రీనివాస్, ముళ్ళపూడి దొరాజీ, కంటిపూడి సుబ్బారావు, ఎంపీడీవో పీ.ప్రభాకరరావు, తహశీల్దార్ కే.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం: దేవరపల్లిలో సుమంత్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడురోజుల పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించటం అభినందనీయమని ఎమ్మెల్యే మద్దిపాటి అన్నారు. శనివారం దేవరపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమంత్ దంత వైద్యశాలను ప్రారంభించిన అనంతరం డాక్టర్ సుమంత్‌ను అభినందించారు. దేవరపల్లిలో ఆసుపత్రి ఏర్పాటు ప్రజలకు ఎంతో ప్రయోజనమన్నారు. కార్యక్రమంలో కొయ్యలమూడి చినబాబు, సుంకర దుర్గారావు, రాంబాబు, డాక్టర్ కే.సూర్యనారాయణ, డాక్టర్ శరత్‌చంద్రిక తదితరులతో పాటు సంగాయిగూడెం సర్పంచ్ కరుటూరి ఉషారాణి, పొగాకు రైతు నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార మహోత్సవాల్లో ప్రసంగిస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

మహిళాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

నిడదవోలు, సెప్టెంబరు 28: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో పెరవలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మహోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమానికి అంగన్‌వాడీలు ఎంతో ప్రాముఖ్యతనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చాగల్లు సెంటర్‌లో అధ్వాన్నంగా మారిన నిడదవోలు, పంగిడి మెయిన్ రోడ్డు

రోడ్డు ఇలా ఉంటే వెళ్లేదెలా?

చాగల్లు, సెప్టెంబరు 28: పంగిడి, నిడదవోలు వయా చాగల్లు ఆర్అండ్‌బీ రోడ్డు పలుచోట్ల గోతులుపడి అధ్వాన్నంగా మారింది. మీనానగరం చర్చి, చాగల్లు సెంటర్‌లో, కాకతీయ కల్యాణ మండపం, ఊనగట్ల సెంటర్, బ్రాహ్మణగూడెం, నిడదవోలు ప్రవేశం వద్ద సహా పలుచోట్ల రోడ్డు భారీ గోతులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళల్లో ప్రయాణం చేసే వారు తరచూ ఆసుపత్రి బారిన పడుతున్న ఉదంతాలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు మరింత పెద్దవిగా మారడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ అధికారి శ్రీనివాస విజయన్‌ని వివరణ కోరగా ఈ రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించామన్నారు.

అన్న సమారాధన

దేవరపల్లి, సెప్టెంబరు 28: దేవరపల్లిలో గణపతి నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా మెరక వీధిలో గల వినాయక ఆలయం వద్ద శనివారం అన్న సమారాధన జరిగింది. ఈ సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నసమారాధన స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు.

వ్యాయామంతో గుండె పదిలం : ఎస్పీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ దురలవాట్లకు దూరంగా ఉంటూ వ్యాయామం చేయడం గుండెను కాపాడుతుందని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కిమ్స్ ఆస్పత్రి వైద్యులు, పోలీసుశాఖ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కిమ్స్ హాస్పటల్ నుంచి పుష్కర ఘాట్ వరకూ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. దురలవాట్లకు స్వస్తిచెప్పి రోజుకు కనీసం గంటపాటు వ్యాయామం చేయడం అలవాటుగా చేసుకుంటే గుండెను ఆరోగ్యంగా ఉంచవచ్చని ఎస్పీ చెప్పారు.



పచ్చజెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు



వనచర్ల రాణి, పిల్లలు

పెరవలి, సెప్టెంబరు 28: ముక్కామలకు చెందిన ఒక వివాహిత తన ఇద్దరు పిల్లలతో పుట్టిల్లు అయిన అజ్జరం వెళుతున్నానని చెప్పి కనిపించకపోవడంపై పెరవలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం...ముక్కామలకు చెందిన వనచర్ల జానకిరాముడుతో వివాహం కాగా వీరికి చంద్రిక (4), వాసంతి లక్ష్మి(17 నెలలు) పిల్లలున్నారని ఎస్ఐ తెలిపారు. శనివారం ఉదయం రాణి పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళుతున్నానని చెప్పి ఎక్కడికి వెళ్లిందో తెలియడం లేదని ఆమె భర్త పెరవలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరి ఆచూకి తెలిసిన వారు పెరవలి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రవీంద్రనాథ్

అసంపూర్తి ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

తాళ్లపూడి, సెప్టెంబరు 28: మండలంలోని అన్నదేవరపేట గ్రామ పంచాయతీలో శనివారం మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి తాళ్లపూడి తహశీల్దార్ రవీంద్రనాధ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పూర్తికాని ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. కూటమి నాయకుడు కూచిపూడి గణేష్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అన్ని విధాలా సహకారాలు అందించి త్వరితగతిన ఇళ్లకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో రుచిత, ముళ్లపూడి శ్రీరామచంద్ర మూర్తి, తొండెపు భరత్, చెవ్వూరు బంగార్రాజు, కార్యదర్శి వీరన్న, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సీడ్ బాల్స్ అందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

విద్యార్థులకు సీడ్ బాల్స్ పంపిణీ

తాళ్లపూడి, సెప్టెంబరు 28: మండలంలోని అన్నదేవరపేట గ్రామంలోని వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా సీడ్‌బాల్స్ తయారు చేసి పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు పల్లపోతు రాధాకృష్ణ మాట్లాడుతూ అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు గ్రామంలో ప్రతి ఇంటి వద్ద ఒక మొక్క నాటాలనే లక్ష్యంతో సీడ్‌బాల్స్ తయారు చేయించి అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సీడ్ బాల్స్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఇమ్మిడిశెట్టి శ్రీనివాస్, మండా గణపతి, కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆస్తులు కబ్జా చేశారు

● జగన్‌పై మండిపడిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 28: తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ఆస్తులను కబ్జాచేసిందని వైసీపీ వాళ్లేనని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యేగోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం క్రైస్తవ మతం తీసుకున్నారని అందరికీ తెలుసునన్నారు. కచ్చితంగా డిక్లరేషన్ ఇచ్చే స్వామివారిని దర్శించుకోవాలన్నారు. గత ఐదేళ్లలో నిబంధనలు పక్కన పెట్టి ఇష్టానుసారం తిరుమలలో తిరిగిన జగన్ ఇప్పుడు డిక్లరేషన్ అంటే బాధపడుతున్నాడని అన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నేత వినుకొండ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, పిన్నింటి రవిశంకర్ పాల్గొన్నారు.

'ఒకే దేశం, ఒకే ఎన్నిక ఆచరణ సాధ్యంకాదు'

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న ఒకే దేశం, ఒకే ఎన్నిక భారతదేశంలో ఆచరణ సాధ్యం కాదు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఊర్వశి సెంటర్ వద్ద సీపీఐ కూరగాయల సెక్షన్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వనజ మాట్లాడారు. అంతకుముందు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా భగత్‌సింగ్, లెనిన్ విగ్రహాలకు జాతీయకార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జట్ల సంఘం అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు తదితరులు పూలమాలలు నివాళులర్పించారు.

కానరాని చిరుతపులి జాడ



ఫారెస్టు అధికారి ప్రసాదరావు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కడియపు లంకలో 24న రాత్రి చివరగా చిరుతపులి అడుగులు గుర్తించామని ఆ తర్వాత దాని అలికిడి లేదని కోనసీమ జిల్లా ఫారెస్టు అధికారి ప్రసాదరావు వెల్లడించారు. వర్షం వల్ల చిరుతపులి అడుగుజాడలు కూడా నేలపై ఉండడం లేదన్నారు. పులి సంచా రం ట్రాప్, సీసీ కెమెరాల్లో కూడా చిక్కలేదన్నారు. చొప్పెల్ల, కేశవరం, మండపేటల్లో కనబడిందని వార్తలు రాగా వెంటనే తమ బృందాలు చేరుకున్నాయన్నారు. స్థానికులను ఆరా తీయగా అవన్నీ వదంతులుగా గుర్తిం చామన్నారు. మొత్తం పది బృందాలు రేయింబవళ్లు గస్తీ తిరుగుతున్నాయని చెప్పారు. చిరుతపులిని బంధించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లతో పాటు, చర్యలు చేపడుతున్నామని ఆయన వెల్లడించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

చాగల్లు, సెప్టెంబరు 28: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఈవోఆర్డీ శ్రవణ్‌కుమార్ కోరారు. ఇందిరమ్మకాలనీ పంచాయతి కార్యాలయం వద్ద అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి సకాలంలో బిల్లులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి ఎల్. రవికుమార్, గృహనిర్మాణశాఖ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన డీటీలు

చాగల్లు, సెప్టెంబరు 28: చాగల్లు తహశీల్దార్ కార్యాలయానికి ఇద్దరు డిప్యూటీ తహశీల్దార్‌లు విధుల్లో చేరారు. తహశీల్దార్ ఎం.మెరికమ్మ వివరాల ప్రకారం ఏలూరు జిల్లా యర్నగూడెం నుంచి వచ్చిన పౌరసరఫరాల డీటీగా టి.శ్రీనివాసరావు విధుల్లో చేరారు. కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల డీటీగా పనిచేసిన ఎం.కమల్ సుందర్ బదిలీపై ఇక్కడకు వచ్చినట్టు తెలిపారు.

డిప్యూటీ తహశీల్దార్‌గా అజయ్

గోపాలపురం, సెప్టెంబరు 28: గోపాలపురం డిప్యూటీ తహశీల్దార్‌గా కె.అజయ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన కె.ప్రదీప్ నిడదవోలు తహశీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కొవ్వూరు ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన కె.అజయ్ గోపాలపురం డిప్యూటీ తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు సీనియర్ అసిస్టెంట్ హరీష్ ఉన్నారు.



పట్టుకున్న అక్రమ మద్యం సీసాలు

అక్రమ మద్యం పట్టివేత

తాళ్లపూడి, సెప్టెంబరు 28: తాళ్లపూడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 20 మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ టి.రామకృష్ణకు అందిన సమాచారం మేరకు తాళ్లపూడి మండలం ప్రక్కిలంక టాక్సీ స్టాండు వద్ద గజ్జరం గ్రామానికి చెందిన కుంచాల వెంకటేశ్వరరావు వద్ద 20 మద్యం సీసాలు దొరికాయన్నారు. వాటిని అధిక ధరకు అమ్ముతుండగా తన సిబ్బందితో వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు

కొవ్వూరు, సెప్టెంబర్ 28: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కాకినాడకు చెందిన తుమ్మలపల్లి శ్రీదేవి భర్త మహేష్ 2021లో మృతి చెందడంతో ఇద్దరు పిల్లలను తీసుకుని కొవ్వూరులో పుట్టింటికి వచ్చింది. తల్లితో పాటు పట్టణంలోని 22వ వార్డు అనంగపాల్ వీధిలో వీరు నివాసం ఉంటున్నారు. జూలైలో తల్లి కూడా మృతి చెందడంతో మనోవేదనకు గురైంది. ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీదేవి తిరిగి రాకపోవడంతో కుమార్తె విజయశ్రీ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా అనేకసార్లు ఇంటి నుంచి బయటకు వెళ్ళి మరలా వచ్చేదని, ఇప్పుడు వారం రోజులు అయినా తిరిగి రాలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో శ్రీదేవి కూతురు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

చోరీపై కేసు నమోదు

కొవ్వూరు, సెప్టెంబర్ 28: ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి చొరబడి బంగారం, నగదు దొంగిలించుకుపోయినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. పట్టణంలోని గౌతమీనగర్‌కు చెందిన మిద్దే భాగ్యలక్ష్మి ఈ నెల 21న ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చొరబడి కబోర్డులో ఉంచిన మంగళసూత్రాలు, గ్రాము బంగారపు రూపు, రూ.5వేల నగదు, సెల్‌ఫోన్, మోటారు సైకిల్ తాళాలతో పారిపోతుండగా అలికిడి కావడంతో భర్త లేచి చూసేసరికి పారిపోయినట్టు భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్ 1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్ 2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	దేవర
రాధాకృష్ణ	దేవర
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	దేవర